
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 07.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 165
పేజీలు: 12 వెల: రూ. 5

# కష్టకాలంలో మొక్కులు

## దేవాలయాల బాట పడుతున్న సీఎం





- అసంతృప్తి ప్రచారం మధ్య ఆధ్యాత్మిక దిశగా సీఎం అడుగులు
- ఓంకారేశ్వరం నుంచి బాసర వరకు ఆలయాలపై ప్రత్యేక దృష్టి
- మూసీ ప్రాజెక్ట్‌తో కలిపి 'దక్షిణ కాశి'గా అభివృద్ధి ప్రణాళిక
- భద్రాచలం అభివృద్ధికి ₹351 కోట్ల భారీ కేటాయింపు
- మేడారం జాతరకు కుంభమేళా తరహా ఏర్పాట్లు
- బాసర సరస్వతి ఆలయానికి ₹225 కోట్లతో మౌలిక వసతులు
- ఆలయాల్లో రాజకీయాలకు నో.. ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం
- టూరిజం, ఉద్యోగాలు లక్ష్యంగా దేవాలయాల అభివృద్ధి
- కేసీఆర్ మోడల్‌కు భిన్నంగా రేవంత్ కొత్త దారి
- భక్తి – అభివృద్ధి – ఆర్థిక వృద్ధి: మూడు లక్ష్యాలపై సీఎం ఫోకస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రంలో అసంతృప్తి పెరుగుతుందనే ప్రచారం నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి దేవాలయాల బాట పడుతున్నారు. దీంతో ఇప్పుడు సీఎంలో ఆధ్యాత్మిక భక్తి కోణం కనిపిస్తోంది. తరచూ ఆలయాలకు వెళ్తున్నారు. ఆలయాల అభివృద్ధిపై ఫోకస్ పెడుతున్నారు. గతంలో కేసీఆర్ కూడా ఇలాగే చేశారు. ఇటీవల ఓంకారేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన, భద్రాచలం సీతారామ కల్యాణ మిగతా 02లో

# టార్గెట్ ట్రబుల్
# షూటర్
## రాజకీయంగా అదే

- కేటీఆర్ కంటే హరీశ్ పైనే గురి
- అసెంబ్లీలో విమర్శలు, ఆరోపణలన్నీ ఆయనపైనే
- రాజకీయ వ్యూహమేనా..?





**ముద్ర, తెలంగాణ బ్యూరో :** బీఆర్ఎస్.. కేసీఆర్.. కేటీఆర్ ను టార్గెట్ చేసే రేవంత్ రెడ్డి.. ఇటీవల పంథా మార్చారు. గతంలోని లేని విధంగా మాజీ మంత్రి హరీశ్ ను టార్గెట్ చేశారు. ఓవైపు కవిత కూడా హరీశ్ రావు పైనే మాటల తూటాలు పేల్చుతున్నారు. ఇదే సమయంలో హరీష్ రావుపై ఎప్పుడూ లేని విధంగా రేవంత్ తీవ్ర ఆరోపణలు చేశారు. విచారణ కూడా చేయిస్తామంటున్నారు. దీంతో తెర వెనుక ఏం జరుగుతోందన్న చర్చ ప్రారంభమైంది.
మిగతా 02లో

# ట్రంప్ డెడ్‌లైన్‌ల డ్రామా..

- ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టిందా?
- హెచ్చరికలతో హాట్.. పొడిగింపులతో కూల్
- హార్ముజ్ ఉద్రిక్తతల మధ్య ట్రంప్ ట్విస్ట్‌లు..
- డెడ్‌లైన్‌ల గేమ్‌తో ఆయిల్ మార్కెట్లు షాక్..

09



అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విలక్షణ విదేశాంగ విధానం ఇప్పుడు ప్రపంచ దేశాలను విస్మయానికి గురిచేస్తోంది. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన జారీ చేస్తున్న వరుస హెచ్చరికలు, అంతలోనే విధిస్తున్న సడలింపులు అంతర్జాతీయ దౌత్య ముఖచిత్రాన్ని అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి.

-ముద్ర డెస్క్ :

## బాసరలో సీఎం మనవడికి అక్షరాభ్యాసం



నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా బాసరకు చేరుకున్న సీఎం దంపతులు, కూతురు, అల్లుడు, మనవడికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు సంజీవ్ మహారాజ్ ముఖ్యమంత్రి మనవడు రియాంశ్ (రుద్రదేవ్)కు అక్షరాభ్యాసం చేయించారు. కూతురు నైమిష దంపతులతో పాటు మంత్రులు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షుడు వెడ్మా బొజ్జు తదితరులు పాల్గొన్నారు. ముద్ర ప్రతినిధి, నిర్మల్

## రూపు మారనున్న ఆలయం

### బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం భూమి పూజ



దేశంలో సరస్వతి అమ్మవారి రెండో దేవాలయంగా పేరున్న బాసర ఆలయం అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. రూ. 225 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో ఉన్న ఆలయం 60 వేల అడుగులకు చేరనుంది. ఆలయానికి కొత్త శిఖరాలు, మండపాలతో పాటు మాడ వీధుల రూపురేఖలు కూడా మారనున్నాయి. రానున్న గోదావరి పుష్కరాల వరకు పనులు పూర్తవ్వాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్, పాల్గొన్నారు.

-ముద్ర ప్రతినిధి, నిర్మల్



# రాక్షస పాలన రానివ్వం

## పిప్రి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

- బీఆర్ఎస్ సృష్టించిన గందరగోళం.. అప్పులను పరిష్కరిస్తున్నాం
- అసెంబ్లీలో ఆరు గ్యారెంటీల అమలుపై చర్చకు రారు
- 2029 తర్వాత జిల్లాల సరిహద్దులు మారుస్తాం
- ఆదిలాబాద్ లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడను నిర్మిస్తాం
- బీఆర్ఎస్ తుమ్మిడిహెట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేసింది
- కాళేశ్వరం, కూలేశ్వరం అయింది
- మేం ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తాం
- జూన్ 2లోపు ఆదిలాబాద్‌లో కొత్త ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభం
- దేశంలోనే గొప్ప ఆలయంగా బాసర నిర్మాణం
- బోథ్, నిర్మల్ లో మా ఎమ్మెల్యేలు లేరు.. అయినా అభివృద్ధి ఆగడం లేదు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీఎం శంకుస్థాపనలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో/ బోథ్ :** అవినీతి, అక్రమాలతో పదేండ్లు రాష్ట్రాన్ని పీల్చి పిప్పి చేసిన బీఆర్ఎస్ గడీల, రాక్షస పాలనను మళ్లీ తెలంగాణలో రానిచ్చే ప్రసక్త లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 2034 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఆదిలాబాద్ బిడ్డల సాక్షిగా చెప్పినట్టు తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు చేశామన్న ఆయన ఇప్పుడు పిప్రి వేదికగా మళ్లీ ఈ విషయాన్ని చెబుతున్నానని చెప్పారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో రాబోతుందని జోస్యం చెప్పారు. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి.. తొలుత నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఆలయ విస్తరణ అభివృద్ధి మిగతా 02లో

# ఆర్థిక కష్టాల్లో వాసవీ గ్రూప్?

### అందుకే సకాలంలో పూర్తి కాని ఫ్లాట్లు

- ప్రీలాంచ్‌లో అమ్మకాలు
- నిధుల దారి మళ్లింపే రీజన్
- హ్యాండోవర్ చేయని ఫ్లాట్లకు నెలనెలా కిస్తీలు
- గగ్గోలు పెడుతున్న ఇంటి కొనుగోలుదారులు
- బయ్యర్ల ఆవేదన.. అంతులేని ఆందోళన

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** గొప్ప ప్రకటనలు.. కొత్త కొత్త ఆఫర్లు.. నమ్మకం మీదే మా పెట్టుబడి అంటూ చెప్పుకుంటున్న వాసవీ గ్రూపు వినియోగదారులను నిండా ముంచుతున్నది. ఇప్పుడు వాసవి సంస్థ ఆర్థిక కష్టాల్లో ఉందని, తమకు ఫ్లాట్లు ఇప్పించాలని వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. సొంతింటి కల సాకారం చేసుకునేందుకు ఫ్లాట్లను కొనేందుకు నెలనెలా వాయిదాలు కడుతూనే.. ఇటు ఇంటి కిరాయిలను కూడా చెల్లిస్తూ.. మిగతా 02లో






# ఐపీఎల్‌లో కొత్త మలుపులు

- పాండ్య ఫిట్‌నెస్ నుంచి కోహ్లీ ఫామ్ వరకు..
- పాండ్య ఫిట్‌నెస్‌పై సందేహం.. ముంబయి జట్టుపై ప్రభావం
- 14.2 కోట్లు చెల్లించి ప్రశాంత్ వీర్ ను ఆడించని సీఎస్‌కే
- రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ.. గోయెంకాతో సంబంధాల్లో మార్పు

11

*ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతోంది. మైదానంలో ఆటగాళ్ల మెరుపులతో పాటు మైదానం వెలుపల జరుగుతున్న పరిణామాలు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఒకవైపు స్టార్ ప్లేయర్ల ఫిట్‌నెస్ సమస్యలు జట్ల సమీకరణాలను దెబ్బతీస్తుంటే, మరోవైపు పాత గొడవలను మర్చిపోయి ఆటగాళ్లు, యాజమాన్యాలు ఒక్కటవుతున్న తీరు చర్చనీయాంశంగా మారింది. 4.2 కోట్లు చెల్లించి ప్రశాంత్ వీర్ ను రవీంద్ర జడేజా ప్లేసులో కొన్న చెన్నై సూపర్ కింగ్స్ అతడికి ఆడించడం లేదు. ముఖ్యంగా హార్దిక్ పాండ్య గైర్హాజరీ ముంబయిని వేధిస్తుండగా, లఖ్‌నవూలో పంత్ ఫామ్ కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.*

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :

## సరిహద్దులో మొసళ్లు, పాములు?

### బీఎస్ఎఫ్ ఆలోచనపై చర్చ




- చొరబాట్లకు చెక్ పెట్టేందుకు బీఎస్ఎఫ్ వినూత్న ఆలోచన
- బంగ్లాదేశ్ సరిహద్దుపై వ్యూహం.. ప్రజల్లో ఆందోళన
- భద్రతా చర్యలలో కొత్త మలుపు.. అమలుపై అనుమానాలు

10

## త్వరలోనే తులం బంగారం

### మంత్రి శ్రీధర్ బాబు



- సీఎంతో మంత్రులకు విభేధాలు లేవు
- రాష్ట్రంలో 99శాతం హామీల అమలు
- హామీలు అమలు చేశాకే.. రాబోయే ఎన్నికలకు

03

# పేలుడు దందా!


- హుజురాబాద్, జమ్మికుంటలో!
- నిబంధనలు గాలికి.. మృత్యుశకటాలుగా మారుతున్న వాహనాలు
- డిటోనేటర్లు, ఎక్స్‌ప్లోజివ్స్ ఒకేచోట..
- కిలోమీటర్ల మేర విధ్వంసమే!

03




ఆ ప్రాంతాలు అగ్నిపర్వతం మీద ఉన్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. హుజూరాబాద్, జమ్మికుంట కేంద్రంగా అత్యంత ప్రమాదకరమైన ఎక్స్‌ప్లోజివ్స్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, లాభమే పరమావధిగా సాగుతున్న ఈ అక్రమ రవాణా స్థానికుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

ముద్ర, కరీంనగర్



## పచ్చిమిర్చి :ముందుగా బాగా కడగాలి



మార్కెట్ నుంచి తీసుకొచ్చిన వెంటనే మిర్చిని శుభ్రంగా కడగాలి.దీనివల్ల మట్టి, బ్యాక్టీరియా తొలగి నిల్వ కాలం పెరుగుతుంది.

# కష్టకాలంలో మొక్కులు

(మొదటి పేజీ తరువాయి)

మహోత్సవం, తాజాగా బాసర సరస్వతి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. ఇలా ఒక్కొక్క ఆలయం దగ్గరా సీఎం కనిపిస్తున్నారు. గతంలో కేసీఆర్ యాదాద్రి వంటి ఆలయాలను భారీగా అభివృద్ధి చేసి యాగాలు కూడా నిర్వహించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారా? లేక మరేదైనా కారణం ఉందా? ఈ ఆధ్యాత్మిక కోణం.. కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ప్లస్ అవుతుందా?

**మూసీ నుంచే ముందడుగు**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్‌లో సీఎం ఆలయాల బాట మరింత పెంచారు. ఇటీవల మంచిరేవుల (గండిపేట్) దగ్గర సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేశారు. ఈ ఆలయం రామప్ప ఆలయ శైలిలో నిర్మాణం అవుతుంది. దీన్ని 'దక్షిణ కాశి'గా అభివృద్ధి చేస్తారు. మొత్తం రూ. 700 కోట్ల ఖర్చు చేసి 8 ఎకరాల్లో శివాలయాల సమూహం ఏర్పాటు చేస్తారు. సీఎం తన కుటుంబ సభ్యులతో కలిసి గోపూజ, అభిషేకం చేశారు. ఇది కేవలం ఆలయం కాదు.. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌లో భాగం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన నది, ఆధ్యాత్మిక వాతావరణం రెండూ ఉంటాయనే కోణాన్ని చూపించారు.

**భద్రాచలం 351 కోట్లతో భారీ అభివృద్ధి**

భద్రాచలంలో సీతారామ కల్యాణ మహోత్సవంలో సీఎం రేవంత్ పాల్గొని ఆలయ విస్తరణకు భూమి పూజ చేశారు. మొదటి దశలో 351 కోట్లు ఖర్చు చేసి ఆలయం, గోదావరి ఘాట్లు, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తారు. 180 కోట్లు ఆలయ విస్తరణకు, 96 కోట్లు పరిసరాలకు, 75 కోట్లను ఘాట్ల అభివృద్ధికి కేటాయించారు. భక్తులు ఇకపై క్వాలిటీ రోడ్లు, శుభ్రమైన గదులు, సులభంగా దర్శనం పొందవచ్చు. ఖమ్మం, భద్రాచలం ప్రాంత ప్రజలకు టూరిజం ద్వారా ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారు.

**సమ్మక్క - సారలమ్మ గద్దెల అభివృద్ధి**

సమ్మక్క–సారలమ్మ మహా జాతర (మేడారం జాతర) తెలంగాణ ఆదివాసీ సంస్కృతి, అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక. ఈ జాతరను కుంభమేళా స్థాయిలో నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి సుమారు ₹251 కోట్లు కేటాయించి, సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజు గద్దెల విస్తరణకు ₹101 కోట్లు, భక్తుల సౌకర్యాలైన రోడ్లు, క్యూ లైన్లు, వసతి, డ్రైనేజీ, ఫ్లడ్ మేనేజ్‌మెంట్ కోసం మిగిలిన నిధులు ఖర్చు చేశారు. నాలుగు లైన్ రోడ్లు, 29 ఎకరాలు + 63 ఎకరాలు అదనపు భూమి సేకరణ, గ్రానైట్ నిర్మాణాలు – అన్నీ ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా జరిగాయి. జనవరి 28–31, 2026లో జరిగిన మహా జాతరకు కుంభమేళా తరహా ఏర్పాట్లు చేశారు.

తాజాగా బాసర సరస్వతి ఆలయంలో సీఎం ప్రవేశించారు. జ్ఞాన సరస్వతి ఆలయానికి 225 కోట్లు కేటాయించారు. గోదావరి పుష్కరాలు (2027) ముందు భక్తుల సౌకర్యాలు, రాజగోపురం, వసతి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. సీఎం సమీక్షలో తిరుమల తరహాలో ఆలయాల్లో రాజకీయ సభలు, జెండాలు, ప్రదర్శనలు నిషేధించాలని ఆదేశించారు. ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

**కేసీఆర్ కాలం vs రేవంత్ రెడ్డి**

మాజీ సీఎం కేసీఆర్, యాదాద్రి ఆలయానికి రూ.1,800 కోట్లు ఖర్చు చేసి ప్రపంచ స్థాయి అభివృద్ధి చేశారు. యాగాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రేవంత్ రెడ్డి కూడా ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై దృష్టి పెడుతున్నారు. కానీ తేడా ఏమంటే.. రేవంత్ 'నేను ప్రాక్టీసింగ్ హిందూ' అని చెప్పుకుంటూ, ఆలయాలను రాజకీయాల నుంచి దూరంగా ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది కేవలం రాజకీయం కాదు – టూరిజం, ఉద్యోగాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు బూస్ట్. హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్ర ప్రజలు ఇప్పుడు మరింత సులభంగా ఆలయాలను చేరుకోవచ్చు. పర్యాటక రంగం వృద్ధి చెందాలంటే.. ఆలయాల అభివృద్ధి కీలకం అని సీఎం రేవంత్ రెడ్డి బలంగా నమ్ముతున్నారు. అందుకే.. వరుసపెట్టి.. ఆలయాలపై ఫోకస్ చెస్తున్నారు. ఇక్కడ సీఎంకు కొన్ని సవాళ్లు కూడా ఎదరయ్యే అవకాశాలున్నాయి. ఎందుకంటే అభివృద్ధి పనులు ఆగమ శాస్త్రానికి అనుగుణంగా జరగాలని పండితులు చెబుతున్నారు. పర్యావరణం దెబ్బతినకూడదని, ప్రభుత్వం ఈ విషయంలో జాగ్రత్తగా ఉంటోందని అధికారులు చెబుతున్నారు. సీఎం ఆదేశాలతో అన్ని ఆలయాల్లో తిరుమల మోడల్ అమలు అవుతుంది. ఇది భక్తుల విశ్వాసాన్ని కాపాడుతుంది. హైదరాబాద్ నుంచి బాసర, భద్రాచలం వరకు రోడ్లు, బస్సులు మెరుగుపర్చాలని భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు ఆలయాలపై ఫోకస్ పెడుతున్నారనే ప్రశ్న ఇప్పుడు మొదలైంది. భక్తి, టూరిజం ప్రోత్సాహం, స్థానిక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అంటూ మూడు కారణాలను కూడా విశ్లేషిస్తున్నారు. అధికారిక సమీక్షలలో ఇదే స్పష్టమవుతోంది. అంతేకాదు.. సీఎం రేవంత్ రెడ్డి దేవాలయాల బాట తెలంగాణను ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తుందని అనిపిస్తుంది. కేసీఆర్ మార్గం కాకపోయినా, ఫలితం ఒకటే. భక్తుల సౌకర్యం, ప్రజల అభివృద్ధి. హైదరాబాద్ నుంచి భద్రాచలం, బాసర వరకు మన ఆలయాలు ఆకర్షణీయంగా మారుతాయి.

# టార్గెట్ ట్రబుల్ షూటర్

(మొదటి పేజీ తరువాయి)

కీలకంగా ప్రతిసారి కేటీఆర్ ను టార్గెట్ చేసే సీఎం రేవంత్ రెడ్డి.. ఇటీవల హరీష్ రావు మీద ప్రతాపం చూపించారు. మైనింగ్ మాఫియా మొత్తం హరీశ్ రావు టీం అంటూ ప్రకటించారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మాజీ మంత్రి హరీష్ రావు చుట్టూ తిరుగుతున్నాయి. నిన్నటి వరకు కేటీఆర్, కవితలపైనే విమర్శనాస్త్రాలు సంధించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన రూటు మార్చి హరీష్ రావును టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా హరీష్ రావుపై భూకబ్జా ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**భూకబ్జా ఆరోపణలు..**

రేవంత్ రెడ్డి నేరుగా పేరు ఎత్తకపోయినా, హరీష్ రావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. ముఖ్యంగా కన్న తండ్రిని పట్టించుకోని వారు.. ప్రజలను ఏం పట్టించుకుంటారు అనే అర్థం వచ్చేలా రేవంత్ చేసిన ఆరోపణలు హరీష్ రావును తీవ్రంగా ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి. రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్ రావుపై ఇలాంటి వ్యక్తిగత, అవినీతి ఆరోపణలు రావడం ఆయన ఇమేజ్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే హరీష్ అనుచరులు, ఆయనకు సంబంధించిన భూ వ్యవహారాలపై విచారణకు ఆదేశించడం మరింత ఒత్తిడిలోకి నెట్టింది.

**బీజేపీ అస్త్రాన్ని వాడుకుంటున్న రేవంత్**

ఈ పరిణామాల మధ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కొత్త ట్విస్ట్‌ను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి కావాలనే హరీష్ రావును ఒంటరిని చేస్తున్నారని, కేటీఆర్, కవితలతో రేవంత్ కున్న రహస్య ఒప్పందంలో భాగంగానే ఈ వ్యూహం నడుస్తోందని సంజయ్ ఆరోపించారు. అంటే, బీఆర్ఎస్ పార్టీని హరీష్ రావు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడానికి, కల్వకుంట్ల కుటుంబంలోని అంతర్గత విభేదాలను రేవంత్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నది బీజేపీ వాదన. ఈ ఆరోపణల్లో నిజమెంత ఉన్నా, రేవంత్ రెడ్డి ఒక్కసారిగా హరీష్ పై పడటం వెనుక బీఆర్ఎస్ కేడర్‌ను గందరగోళానికి గురిచేసే ప్లాన్ స్పష్టంగా కనిపిస్తోంది.

**బిగుస్తున్న ఉచ్చు!**

ప్రస్తుతానికి పరిస్థితులు హరీష్ రావుకు వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వపరంగా విచారణలు, ఇటు రాజకీయంగా సొంత పార్టీలోనే ప్రాధాన్యత తగ్గిపోతోందన్న ప్రచారం ఆయనను ఆత్మరక్షణలో పడేశాయి. కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే హరీష్ రావుపై ఈ స్థాయిలో దాడులు జరగడం యాదృచ్ఛికం కాదని రాజకీయ పండితులు భావిస్తున్నారు. హరీష్ రావుకు ఉన్న మాస్ ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపరచవచ్చని రేవంత్ భావిస్తున్నారు.

**ట్రబుల్ షూటర్ ముందన్న సవాల్**

ఎన్నికల సమయంలో లేదా పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు సంక్షోభాలను చక్కదిద్దే హరీష్ రావు, ఇప్పుడు తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రేవంత్ రెడ్డి విసురుతున్న సవాళ్లను ఆయన ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే హరీష్ రావు తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కానీ, అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు బీజేపీ నేతల విమర్శల మధ్య ఆయన తన పట్టును ఎలా నిలుపుకుంటారో చూడాలి. రేవంత్ రెడ్డి వర్సెస్ హరీష్ రావు పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు తనపై వస్తున్న అవినీతి మరకలను తొలగించుకోవాల్సిన బాధ్యత హరీష్ పై ఉంది. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ మైండ్ గేమ్ ' బీఆర్ఎస్‌లో చీలిక తెస్తుందా లేక హరీష్ రావును బలమైన నేతగా మారుస్తుందా అనేది కాలం నిర్ణయించాలి.

# రాష్ట్రంలో మళ్లీ రాక్షస పాలన రానివ్వం

(మొదటిపేజీ తరువాయి)

పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ పరిధిలోని పిప్రిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. తమ పాలనలో భార్యభర్తల ఫోన్లు కూడా విన్న బీఆర్ఎస్ నేతలు నేడు నడి రోడ్లపై తమను తిడుతున్నా తాము ఎవరిపై కేసులు పెట్టలేదని సీఎం చెప్పారు. వారి లాగా ఎవరికీ సతాయించడం లేదన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారని చెప్పారు.

**ఆంక్షలు సడలగానే జిల్లాల పునర్వ్యవస్థీకరణ**

కేంద్రం విధించిన ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దుల్లో మార్పులు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆంక్షల కారణంగా 2027 మార్చి 31 వరకు ఎలాంటి పునర్వ్యవస్థీకరణకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసి బోథ్ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలనే డిమాండ్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇతర సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని, అప్పులు మరియు పరిపాలనా గందరగోళాన్ని తమ ప్రభుత్వం దశలవారీగా సరిచేస్తోందని సీఎం అన్నారు. ప్రతిపక్ష నాయకులు అభివృద్ధి పనులను పక్కనబెట్టి విమర్శలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు చేయలేని పనులను ఇప్పుడు ప్రశ్నించడం సరికాదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. అన్ని నియోజకవర్గాలకు పార్టీ తేడా లేకుండా నిధులు కేటాయిస్తూ సమగ్ర అభివృద్ధిని లక్ష్యం గా పెట్టుకున్నామని తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లాకు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించి అమలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు జిల్లాను సస్యశ్యామలం చే యడం లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి జూన్ 2లోగా శంకుస్థాపన చేస్తామని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఆదిలాబాద్‌ను పారిశ్రామి క కేంద్రంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, కొత్త యూనివర్సిటీ ఏర్పాటు చేసి విద్యా అవకాశాలను మెరుగుపరుస్తామని చెప్పారు.


బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయ అభివృద్ధికి రూ.225 కోట్లతో మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ ప్రణాళిక ద్వారా ఆలయ విస్తరణతో పాటు పర్యాటక సదుపాయాలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

ఇదే సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్య, సాగునీరు, మౌలిక వసతులు, విద్యుత్ రంగాల్లో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బోథ్ నియోజకవర్గంలో గురుకుల పాఠశాల, టెక్నాలజీ సెంటర్ నిర్మాణాలు ప్రారంభించగా, ఇతర ప్రాంతాల్లో వంతెనలు, రహదారులు, విద్యుత్ ఉపకేంద్రాలు, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారు. సాగునీటి రంగంలో పిప్రి, తేజాపూర్, ముత్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు చేపట్టడంతో పాటు చెక్‌డ్యామ్‌లు, వాగు ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేశారు. ఈ పనుల ద్వారా జిల్లాలో వ్యవసాయం, విద్య, ఉపాధి రంగాలు మరింత బలోపేతం అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ఇళ్ల నిర్మాణం, సాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. బోథ్ నియోజకవర్గంలో భారీ పెట్టుబడులతో విద్యా, మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతోందని, త్వరలోనే బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.







# అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అంతరాలు లేని సమాజ నిర్మాణమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పిప్రి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చామని తెలిపారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు చెప్పిన భట్టి, అధికారంలోకి రాగానే వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. ఈ క్రమంలోనే రూ. 1,238 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేపట్టినట్లు వివరించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 22,500 కోట్లతో భారీ స్థాయిలో గృహ నిర్మాణం కొనసాగుతోందని, ఒక్కో ఇల్లు రూ. 5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'ను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పాఠశాలను రూ. 200 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల పిల్లలు ఒకే చోట చదివేలా చేసి సమానత్వాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు.ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం ద్వారా ప్రభుత్వం మానవీయ దృక్పథంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.




# ఆర్థిక కష్టాల్లో వాసవి గ్రూప్?

(మొదటి పేజీ తరువాయి)

సొంతింటికి దూరమవుతున్న వినియోగదారులు వాసవి గ్రూపు మోసం మీద ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. వినియోగదారులు వెళ్లి అడిగినా.. వాసవీ సంస్థ నిర్లక్ష్యం సమాధానం చెప్పుతోందని మండిపడుతున్నారు. మంచి ఆఫర్లు అంటూ ఆశ చూపించి.. కోట్లు వసూ లు చేసిన సంస్థ అనుకున్న సమయానికి ఫ్లాట్లను అప్పగించడంలో మాత్రం మోసానికి పాల్పడుతూనే ఉంది. దీనిపై అధికారులకు వరుస ఫిర్యాదులు అందుతున్నా.. చర్యలు మాత్రం ఉండటం లేదు. ఇటీవల బాచుపల్లి, వాసవి అర్బన్ లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన వినియోగదారులు తమకు ఇంకా ఫ్లాట్లు అప్పగించడం లేదంటూ ఆందోళన చేశారు. వారికి ఇప్పటి వరకు కూడా ఒక్క ఫ్లాట్ అప్పగించలేదు. మియాపూర్– గండిమైసమ్మ ప్రధాన రహదారికి ఆనుకుని బాచుపల్లిలోని సర్వే నంబర్ 126 పార్ట్, 136 పార్ట్‌లలో కోమటికుంటలో వాసవి అర్బన్ నిర్మాణ సంస్థ 12 టవర్లు, 24ఫ్లోర్లతో పెద్దఎత్తున 3714 ఫ్లాట్లను ఇప్పటికే అప్పగించాల్సి ఉండగా ఇంత వరకు నిర్మాణాలు కూడా పూర్తి చేయలేదు.

2020లో పనులు ప్రారంభం కాగా, డిసెంబర్, 2024 వరకు నిర్మాణాలు పూర్తిచేసి కొనుగోలుదారులకు అప్పగిస్తామని ఒప్పందం చేసుకున్నది. రంగు రంగుల కరపత్రాలను చూపించి లలక్షలాది రూపాయలు వసూలు చేశారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు కొనుగోలుదారులకు ఫ్లాట్లు కట్టించి ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తుంది. పలుమార్లు ఆందోళన చేస్తే ఈ ఏడాది జనవరిలోనే ఫ్లాట్లను అప్పగిస్తామని ఇచ్చిన హామీని నిర్మాణ సంస్థ నిర్వాహకులు ఇప్పటికి కూడా ఫ్లాట్లు అప్పగించడం లేదు. ఈ ఏడాది జనవరిలోనే సొంతింట్లోకి వెళ్తామని, అర్బన్ నిర్మాణ సంస్థ సమీపంలో అద్దె ఇండ్లలో ఉంటూ.. తమ పిల్లలను అక్కడే స్కూల్లో చేర్పించామని బాధితులు పేర్కొన్నారు. దీంతో అదనపు భారంతోపాటు, లేని ఫ్లాట్లకు ఈఎంఐలూ కట్టాల్సిన పరిస్థితి వ చ్చిందని ఆందోళన చెందారు. కొత్త ఇండ్లు కొనుగోలు చేశామనే సంతోషం లేకుండా, ఇంటినొక పీడకలగా వాసవి గ్రూప్ మార్చిందని మండిపడ్డారు. పలుమార్లు చర్చలకు పిలిచి.. త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ అతీగతీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కల్లబొల్లి మాటలతో కాలం గడుపుతున్నారే తప్పా.. తమకు ఫ్లాట్లను అప్పగించడం లేదని పేర్కొన్నారు. చేసుకున్న ఒప్పందం ప్రకారం, రెండింతల గడువు ముగిసినా.. నిర్మాణ పనులు పూర్తి చేయకుండా, ఫ్లాట్లను అప్పగించకుండా వాసవి గ్రూప్ యాజమాన్యం చేస్తున్న నిర్లక్ష్యం తమకు ఆర్థికభారంగా మారుతుందని వాపోయారు.

**ఆర్థిక నష్టాల్లో వాసవి గ్రూప్..?**

విచ్చలవిడిగా పలుచోట్ల నిర్మాణాలు ప్రారంభించిన వాసవి గ్రూపు.. ఇప్పుడు ఆర్థిక నష్టాల్లో ఉందని ప్రచారం జరుగుతోంది. వినియోగదారులకు కూడా ఆర్థిక నష్టాలను సాకుగా చూపుతున్నది. నిజానికి, నిర్మాణ వ్యయంలో దాదాపు 90 శాతం డబ్బులను వినియోగదారులను వసూలు చేసిన వాసవి గ్రూపు.. వాటితో ఏం చేసిందో కొనుగోలుదారులకు కూడా చెప్పడం లేదు. కనీసం సమాధానం కూడా సరైన విధంగా ఇవ్వడం లేదు. నిర్మాణానికి మొదటి నుంచే వాసవి అర్బ న్ వివాదాల్లో కొట్టుమిట్టాడుతున్నది. ఇందు కు బాచుపల్లి కోమటికుంటలో వాసవి అర్బన్ నిర్మాణ సంస్థ నిర్మాణం చేపట్టడమే ప్రధాన కారణం. నిర్మాణం అవుతున్న టవర్లు కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్ 8,9 పరిధిలో ఉన్నాయని గతంలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు, హైకోర్టుకు ఫిర్యాదులు వెళ్లాయి. కొనుగోలుదారులకు ఇచ్చిన హామీలను దాటవేయడంతో పాటు, మొత్తం డబ్బులతో జేబులు నింపుకున్న తీరును కొ నుగోలుదారులు బయటపెట్టారు. వసూలు చేసిన మొత్తానికి తగినట్టు కూడా నిర్మాణంలో పురోగతి లేదని, కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మండిపడుతున్నారు.




**డ్రీమ్ హోం ఆశ**

డ్రీమ్ హోమ్ ఆశ చూపించి మధ్య తరగతి కుటుంబాలతో వాసవి గ్రూపు ఆడుకుంటున్నది. తప్పుడు హామీలతో బయ్యర్లను ఆకట్టుకొని వారి నుంచి 81 శాతం ముందే డబ్బులు కట్టించి తీరా సమయానికి వారికి ఫ్లాట్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వారిని రోడ్డున పడేసింది. తాజాగా ఈ గ్రూపు వ్యవహారనంపై రెరాకు ఫిర్యాదులు అందాయి.

**గతంలో కూడా అంతే..**

వాసవి గ్రూపు ప్రతిసారి ఏదో తరహా మోసానికి పాల్పడుతూనే ఉంది. గతంలో రెరా.. వాసవి గ్రూప్ నిర్వాహకంపై గట్టి షాక్ ఇచ్చింది. ఆలస్యంతో పాటు కొనుగోలుదారులకు తప్పుడు హామీలు ఇచ్చిన వాసవి గ్రూప్‌పై రెరా ఆగ్రహం వ్యక్తం చేసింది. కొనుగోలుదారుల నుంచి 81 శాతం డబ్బులను ముందే తీసుకొని ఫ్లాట్లు సమయానికి ఇవ్వకపోవడం, కొనుగోలుదారులను తప్పుడు హామీలతో మభ్యపెట్టడం వంటి కారణాలతో చర్యలు తీసుకున్నది. కొనుగోలుదారుల నుంచి తీసుకున్న నగదుపై 10.85శాతం వడ్డీతో సహా చెల్లించాలని ఖరాఖండిగా చెప్పేసింది. ఒప్పందం ప్రకారం హ్యాండోవర్ చేస్తానన్న తేదీ 2024 మార్చి నుంచి తిరిగి వారికి హ్యాండోవర్ జరిగే వరకు చెల్లించాల్సిందేనని రెరా ఆదేశాలు జారీ చేసింది.

**వివాదాల వాసవి**

హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట మంజీరా పైపులైన్ రోడ్డులో లేక్ సిటీ– వెస్ట్ పేరిట ప్రాజెక్ట్ కు 2020లో అనుమతులు తీసుకున్నారు. సెల్లార్+గ్రౌండ్+14 ఫ్లోర్లతో ఏడు టవర్ల నిర్మాణం జరుగుతున్నది. ఇందులో 2, 3 బీహెచ్‌కే ఫ్లాట్‌లు ఉన్నాయి. తొలుత 2023 ఆగస్టు నాటికి ఫ్లాట్లు అందజేస్తామని వాసవి గ్రూప్ కొనుగోలుదారులతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఆరు నెలల గ్రేస్ పీరియడ్‌తో కలిపి గరిష్ఠంగా గతేడాది ఫిబ్రవరిలో హ్యాండోవర్ చేయాలని నిబంధన ఉంది. కానీ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇలా వాసవి గ్రూప్ చేపడుతున్న ప్రాజెక్టుల్లో ఒక్కో చోట ఒక్కో రీతిలో అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కాగితాల్లో చెప్పేదొకటి.. క్షేత్రస్థాయిలో చేసేదొకటి అన్నట్లు అంతులేకుండా అక్రమాలకు పాల్పడుతున్నది. కొనుగోలుదారులే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టులను చేపడుతున్నది. హఫీజ్‌పేట లేక్ సిటీ –వెస్ట్ ప్రాజెక్టులో కొనుగోలుదారులను మోసం చేస్తే కూకట్‌పల్లి ఖైత్లాపూర్‌లో వాసవీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణాలపై హైడ్రా సీరియస్‌గా వ్యవహరించింది. భరత్‌నగర్–ఖైత్లాపూర్ మార్గంలోని కాముని చెరువు–మైసమ్మ చెరువులను కలుపుతూ సాగే వరద కాలువను కబ్జా చేసిన వాసవి నిర్మాణ సంస్థపై హైడ్రా కేసు నమోదు చేసింది. 17 మీటర్ల వెడల్పుతో పాటు ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్ జోన్ వదలకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి అక్రమాలను గుర్తించారు. హైడ్రా సూచన మేరకు ఇరిగేషన్ శాఖ కూకట్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
07.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పచ్చిమిర్చి : పూర్తిగా ఆరబెట్టాలి**

కడిగిన వెంటనే నిల్వ చేయకండి. నీటి తేమ ఉంటే బూజు త్వరగా పడుతుంది.



# అక్షరాలతో అద్భుతం

- **డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డికి 'ఫోటో ఆర్ట్'తో జన్మదిన శుభాకాంక్షలు**

**ముద్ర, హైదరాబాద్:**

ప్రముఖ కవి, సాహితీవేత్త, ఐఏఎస్ అధికారి డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని యువ చిత్రకారిణి పి.సుష్మ తనదైన శైలిలో వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. అక్షరాలనే ఆయుధంగా చేసుకుని ఆమె గీసిన 'ఫోటో ఆర్ట్' ఇప్పుడు అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది. తన పుట్టినరోజు సందర్భంగా ఇంతటి అపురూపమైన కానుకను అందించిన సుష్మను డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు తన ఆశీస్సులు అందజేస్తూ, ధన్యవాదాలు తెలిపారు.






# పాఠశాలకు బెంచీల అందజేత

**ముద్ర, హైదరాబాద్:**

సికింద్రాబాద్‌కు చెందిన ఎస్జెసీ చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థుల అభ్యాసానికి తోడ్పాటుగా ముందుకొచ్చింది. సోమవారం సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.2 లక్షల విలువైన 50 స్టీల్ డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు బూరుగు నాగ శ్రీధర్, సిరీస్ జవ్వాజి, బూరుగు శ్రీ నాగేష్, శ్రీనివాస్ సాలికే, రవళి సోమ, ధీరజ్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు కె. రాములకు బెంచీలను అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి బూరుగు నాగ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి తమ వంతు సేవలు అందించాలని కోరారు. అలాగే అందించిన బెంచీలను జాగ్రత్తగా ఉపయోగించి భవిష్యత్‌లో వచ్చే విద్యార్థులకు కూడా ఉపయోగపడేలా కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు సూర్యపల్లి ఉమాదేవి, ఎంఇఓ బాసునాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వసంతతో పాటు ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, సత్తయ్య, నారాయణ, బాలనరేందర్, కవిత, రాధ, శోభ, వెంకటేశ్, రోజ, భాగ్యమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ క్రైమ్ లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- **డీజీపీ శివధర్ రెడ్డి**
- **భువనగిరిలో భరోసా సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ, అడిషనల్ డీజీపీ**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ వంటి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం భువనగిరి పట్టణంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్‌లతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి, అడిషనల్ డీజీపీ (లా & ఆర్డర్) మహేష్ ఎం. భగవత్ భరోసా సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు చాలా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గల్లీ క్రికెట్ స్ఫూర్తిని చాటిచెబుతున్న జొమాటో

**ముద్ర, హైదరాబాద్ :**

దేశంలో క్రికెట్ జ్వరం ఊపందుకున్న వేళ, జోమాటో గల్లీ క్రికెట్ స్ఫూర్తిని వెలుగులోకి తెస్తోంది. డిజిటల్ కంటెంట్ ప్లాట్‌ఫామ్ 'గల్లీ క్రికెట్'తో కలిసి ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించింది.ఈ ప్రచారం ద్వారా స్టేడియంలకు పరిమితం కాకుండా, సందులు, చిన్న మైదానాల్లో ఆడే వీధి క్రికెట్‌ను ఆకట్టుకునే విధంగా చూపిస్తోంది. ఐదుగురు సభ్యుల జట్లతో సహజ వాతావరణంలో చిత్రీకరించిన రీల్స్‌కు మ్యాచ్ తరహా ఎఫెక్ట్స్ జోడించి ప్రేక్షకులను ఆకర్షిస్తోంది.ఇప్పటికే మొదటి మూడు రీల్స్ ఇన్ స్టాగ్రామ్ లో జొమాటో అధికారిక ఖాతాలో విడుదలయ్యాయి. క్రికెట్ సీజన్ మొత్తం ఇలాంటి మరిన్ని కంటెంట్‌ను అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది.




# 'పేలుడు' దందా!

- **హుజురాబాద్, జమ్మికుంటలో పేలుడు పదార్థాల అక్రమ దందా!**
- **నిబంధనలు గాలికి.. మృత్యుశకటాలుగా మారుతున్న వాహనాలు**
- **డిటోనేటర్లు, ఎక్స్‌ప్లోజివ్స్ ఒకేచోట..**
- **ఏమరపాటుగా ఉంటే కిలోమీటర్ల మేర విధ్వంసమే!**
- **అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికుల ఆందోళన**

**ముద్ర, కరీంనగర్:**




ఆ ప్రాంతాలు ఇప్పుడు అగ్నిపర్వతం మీద ఉన్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. హుజూరాబాద్, జమ్మికుంట కేంద్రంగా అత్యంత ప్రమాదకరమైన ఎక్స్‌ప్లోజివ్స్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, లాభమే పరమావధిగా సాగుతున్న ఈ అక్రమ రవాణా స్థానికుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

**మృత్యువుతో వ్యాపారుల చెలగాటం..**

నియమ నిబంధనల ప్రకారం పేలుడు పదార్థాలను, డిటోనేటర్లను వేర్వేరు వాహనాల్లో తరలించాలి. కానీ, ఇక్కడ వ్యాపారులు ఖర్చు తగ్గించుకోవడానికి రెండింటినీ ఒకే వాహనంలో కుక్కి మరీ తరలిస్తున్నారు. స్వల్ప ఉష్ణోగ్రతలకే భారీ పేలుడు సంభవించే అవకాశం ఉన్న ఈ పదార్థాలను ఎండ తీవ్రతను కూడా లెక్కచేయకుండా రద్దీగా ఉండే జనసమ్మర్థ ప్రాంతాల గుండా తరలిస్తున్నారు. పొరపాటున ఏదైనా చిన్న ప్రమాదం జరిగితే.. కిలోమీటర్ల మేర ఆస్తి, ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది.

**నిద్రపోతున్న అధికార యంత్రాంగం..**

పట్టపగలే ఇంతటి ప్రమాదకర దందా సాగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ."రద్దీగా ఉండే రోడ్లపై ఈ మృత్యు వాహనాలు తిరుగుతుంటే భయమేస్తోంది. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే దానికి బాధ్యత ఎవరిది?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**తక్షణ చర్యలు అవసరం..**

అక్రమంగా నిల్వ చేస్తున్న గోదాములపై, నిబంధనలు పాటించని వాహనాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భారీ ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరగకముందే యంత్రాంగం మేల్కొనాలని కోరుతున్నారు.

# బెంగళూరు నుంచి సికింద్రాబాద్ కు తరలింపు

- **35 కి.మీ గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిన నగర పోలీసులు**
- **శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆస్పత్రి వరకు ట్రాఫిక్ నియంత్రణ**
- **ప్రత్యేక అంబులెన్స్ ముందు వెనకా పైలెట్ వాహనాలు**
- **ప్రాణాపాయ రోగికి పూర్తయిన శస్త్రచికిత్స**
- **పోలీసుల పనితీరుపై సర్వత్రా ప్రశంసలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




బెంగళూరు నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి అత్యవసరంగా ఊపిరితిత్తులను తరలించేందుకు హైదరాబాద్ పోలీసులు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆస్పత్రి వరకు ఉన్న భారీ ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ.. ప్రత్యేక అంబులెన్స్‌కు మార్గం సుగమం చేశారు. డాక్టర్ల బృందం సకాలంలో అవయవాలను ఆస్పత్రికి చేర్చడంతో.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి శస్త్రచికిత్స చేసేందుకు వీలు కలిగింది. పోలీసుల పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

**అసలేం జరిగిందంటే..**

ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మరోసారి కీలకంగా వ్యవహరించారు . బెంగళూరులో సేకరించిన ఊపిరితిత్తులను అత్యవసర చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. సాధారణంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే భారీ ట్రాఫిక్ కారణంగా గంటల సమయం పడుతుంది. కానీ.. అవయవ మార్పిడి చికిత్సలో సమయం ఎంతో విలువైనది కావడంతో డాక్టర్లు వెంటనే నగర ట్రాఫిక్ పోలీసుల సాయాన్ని కోరారు. దీంతో స్పందించిన హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం పోలీసులు.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కిమ్స్ హాస్పిటల్ వరకు దాదాపు 35 కిలోమీటర్ల మేర 'గ్రీన్ ఛానెల్ ' ఏర్పాటు చేశారు. బెంగళూరు నుంచి విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న డాక్టర్ల బృందం.. మధ్యాహ్నం ఊపిరితిత్తులను ప్రత్యేక అంబులెన్స్‌లోకి మార్చింది. సరిగ్గా అదే సమయంలో పోలీసులు అంబులెన్స్ వెళ్లే దారిలో ఉన్న అన్ని ట్రాఫిక్ సిగ్నళ్లను ఆపివేసి.. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో అంబులెన్స్ వేగంతో సురక్షితంగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి చేరుకుంది. ఈ గ్రీన్ ఛానెల్ ఏర్పాటు కేసం సైబరాబాద్, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పనిచేశారు. ఊపిరితిత్తులు సకాలంలో ఆసుపత్రికి చేరడంతో కిమ్స్ డాక్టర్లు వెంటనే శస్త్రచికిత్సను ప్రారంభించారు. ఈ తరలింపు సాఫీగా సాగేలా పైలట్ వాహనాలు అంబులెన్స్‌కు ముందు వెనకా ఏర్పాటు చేశారు.

**గతంలోనూ..**

గతంలో కూడా పలుమార్లు గుండె, కాలేయం వంటి అవయవాలను తరలించేందుకు పోలీసులు ఇలాంటి గ్రీన్ ఛానెల్స్ ఏర్పాటు చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా.. అత్యవసర వైద్య సేవల కోసం పోలీసులు చూపుతున్న ఈ చొరవను నగరవాసులు, రోగి బంధువులు అభినందిస్తున్నారు. ఈ రకమైన వేగవంతమైన రవాణా వ్యవస్థలు అవయవ దాన ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అంటున్నారు



# బండి.. రేవంత్ తో కలిసి పని చేయాలి

- **ప్రభుత్వ విప్ వేముల వీరేశం**
- **నియోజకవర్గాల పునర్విభజన అంశంపై అసత్య ప్రచారం వద్దు**
- **పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

పని చేయడం చేతకాకపోతే, సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పనిచేయాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సలహా ఇచ్చారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన బండి సంజయ్..ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరిగేలా పని చేయాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ లో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలను తప్పుబట్టారు. సీఎం రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందనీ, అందుకే సీఎం రేవంత్ రెడ్డి దీన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. దక్షిణాది నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్, ఇక్కడి రాష్ట్రాలకు నష్టం జరగనివ్వనని చెప్పాల్సింది పోయి.. సీఎంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ దేశం పట్ల కేవలం తనకు మాత్రమే భక్తి ఉన్నట్టుగా బండి సంజయ్ ప్రవర్తన ఉందని ఎద్దేవా చేశారు. త్యాగాల చరిత్ర కాంగ్రెస్‌ది అని గుర్తుచేశారు. దేశం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో త్యాగాలు చేసిందని చెప్పారు. గాంధీ కుటుంబం ఈ దేశ సమగ్రత కోసం రక్తాన్ని ధారపోసిందన్నారు. అలాంటి గొప్ప చరిత్ర ఉన్న పార్టీ నుంచి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతుంటే బీజేపీ నేతలు భయపడుతున్నారని విమర్శించారు.

# త్వరలోనే తులం బంగారం

- **మంత్రి శ్రీధర్ బాబు**
- **రాష్ట్రంలో 99శాతం ఎన్నికల హామీల అమలు**
- **హామీలన్నీ అమలు చేశాకే ఎన్నికలకు వెళ్తాం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి, తులం బంగారం పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎన్నికలకు ముందు తాము ఇచ్చిన హామీల్లో రాష్ట్రంలో 99శాతం అమలు చేస్తున్నట్లు చెప్పారు. మిగతావి కూడా త్వరలోనే అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేయబోతున్నామన్నారు. తమ ఐదేళ్ల పదవీకాలం ముగిసేలోపు హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ఆ తర్వాతే ప్రజల వద్దకు వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు కొంచెం ఆలస్యం అయినా ప్రజలకు ఇచ్చిన అన్నీ హామీలు వంద శాతం నెరవేర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు.

**సీఎంతో మంత్రులకు విభేధాలు లేవు..**

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గం ఐక్యంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. సీఎంకు, సీనియర్ మంత్రులకు మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారంలో వాస్తవం లేదని వివరణ ఇచ్చారు. సీఎం కెప్టెన్‌గా ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రస్తుతం బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారని అన్నారు.



# భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- **దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్**

**మహదేవపూర్, ముద్ర:**




సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పక్కా ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో దేవాదాయ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్ ఇంజినీరింగ్, విద్యుత్తు, మిషన్ భగీరథ, వైద్య, ఆర్టీసి అధికారులతో శాశ్వత, తాత్కాలిక పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాత్కాలిక మరుగుదొడ్లు, సురక్షిత మంచినీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లైటింగ్ లోకేషన్లు గుర్తించాలన్నారు. మే మొదటి వారంలో పనులు ప్రారంభించాలని సూచించారు. 12 రోజుల పాటు హారతి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. దేవాలయాన్ని విద్యుద్దీకరణ చేయాలని పేర్కొన్నారు. అనంతరం కాళేశ్వరంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ధార్మిక సలహాదారు గోవింద హరిలతో కలిసి సరస్వతి ఘాట్, మ్యూజియంలో ఏర్పాటు చేయనున్న విగ్రహాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక అడ్వైజర్ గోవిందహరి, అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
మంగళవారం 07.04.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## మళ్లీ తెరపైకి గ్రేటర్ రాయలసీమ ..!




ఏపీలో ఇప్పుడిప్పుడే రాజధాని వ్యవహారం ఒక కొలిక్కి వచ్చిందని అంతా అనుకుంటున్నారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణా విడిపోయాక 2014 నుంచి 12 ఏళ్ళుగా ఏపీ పడుతూ లేస్తూ ముందుకు సాగుతోంది. ఇక రాజధాని వ్యవహారం చూస్తే దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కానీ వేటికీ లేని శతకోటి వివాదాలు ఏపీకి దాపురించాయని అంతా అనుకుంటున్న నేపధ్యం ఉంది. ఇక ఏపీకి అమరావతి రాజధానిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా చట్టం చేసింది. దాంతో ఏపీకి ఇక రాజధాని హంగు వచ్చిందని అంతా హ్యాపీగా తరతరాలూ ముందుకు సాగవచ్చు అని అనుకుంటున్న వేళ సీనియర్ రాజకీయ నేత మాజీ హోం మంత్రి ఎంవీ మైసూరారెడ్డి ఒక బాంబు పేల్చారు. ఏపీలో రాజధాని పరిణామాలు రాజకీయాలు చూస్తూంటే గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం తప్పదనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు

ఆయన తాజాగా ఒక యూట్యూబ్ చానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఏపీలో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఆనాడు కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామ కృష్ణన్ కమిషన్ అయితే అమరావతి ప్రాంతాన్ని కానీ విజయవాడ గుంటూరుని కానీ రాజధానిగా ఎంపిక చేయవద్దని కీలక సూచనలు చేసింది అని గుర్తు చేశారు. దొనకొండ వద్ద ఏకంగా డెబ్బై వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కూడా కమిషన్ చెప్పిందని అన్నారు. అంతే కాదు రాజధాని నిర్మాణం కోసం వ్యవసాయిక భూములను తీసుకోవద్దని ప్రైవేట్ భూములు అంతకంటే తీసుకోవద్దని చెప్పింది అన్నారు. ప్రజల మీద పెద్దగా భారం లేకుండా ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్న చోట రాజధాని నిర్మించుకోవాలని కీలక సూచనలు చేసిందని గుర్తు చేశారు.

అయితే ముఖ్యమంత్రిగా విభజన ఏపీకి తొలిసారి బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు పట్టుబట్టి మరీ వ్యవసాయ ప్రాంతం మునక ప్రాంతం అయిన అమరావతిని ఎంపిక చేశారని మైసూరారెడ్డి విమర్శించారు. దాని వల్ల రైతుల ప్రయోజనాలు దెబ్బతిన్నాయని ప్రజల మీద పెను భారం పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక జగన్ అయితే మావిగన్ పేరుతో కొత్త ప్రతిపాదనలు చేయడం మరింత బాధాకరం అన్నారు. శివరామ కృష్ణన్ కమిషన్ వద్దు అన్న చోట్లనే ఈ ఇద్దరు నాయకులు రాజధాని అంటున్నారని ఆయన నిందించారు. ఈ ఇద్దరినీ రాయలసీమ పెంచి పోషించిందని రాజకీయంగా కీలక స్థానం ఇచ్చిందని అయినా సరే వీరు ఈ విధంగా వ్యవహరించడం దారుణం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాను ఈపాటికే గ్రేటర్ రాయలసీమ ఉద్యమాన్ని ప్రారంభించాల్సి ఉందని అయితే వయసు కారణంగా ఆగిపోతున్నాను అన్నారు. కానీ రాయలసీమకు జరుగుతున్న అన్యాయం పట్ల యువత స్పందించాలని వారు గ్రేటర్ రాయలసీమ నినాదంతో ఉద్యమించాలని మైసూరారెడ్డి పిలుపు ఇవ్వడం విశేషం. నీలం సంజీవ రెడ్డి కర్నూల్ కి రాజధానిని తెచ్చారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులే ఎంతో కొంత రాయలసీమను అభివృద్ధి చేశారు అని మైసూరారెడ్డి చెప్పుకొచ్చారు.

వైసీపీ అధినేత జగన్ కి రాజధాని విషయంలో స్పష్టమైన ఆలోచనలు ఏమీ లేవని మైసూరా తీవ్ర విమర్శలు చేశారు. ఆనాడు అమరావతి రాజధానిని టీడీపీ ప్రభుత్వం అనుకున్నపుడు వ్యతిరేకించమని రాయలసీమ ఉద్యమ నేతలుగా కోరామని ఆయన గుర్తు చేశారు. అయితే జగన్ మాత్రం ఆనాడు ఓకే అని అసెంబ్లీలో చెప్పారని గుర్తు చేశారు. ఆ తరువాత ఆయన వ్యతిరేకించి మూడు రాజధానులు ముందుకు తెచ్చారని అన్నారు ఇపుడు మావిగాన్ అంటున్నారని ఆయనకు స్థిరమైన అభిప్రాయం లేదని మైసూరా అన్నారు. మావిగాన్ అన్నది అర్థం పర్థం లేని వ్యవహారం అని కొట్టిపారేశారు. కర్నూల్ నుంచి హైదరాబాద్ కి రావడం అన్నది మౌలిక సదుపాయాల కోసమే జరిగింది అని అన్నారు. ఇపుడు అయినా రాయలసీమకు న్యాయం జరగాలని ఆయన కోరారు.

- కనపర్తి రవి

## ఇతరులకు రక్షణ.. జర్నలిస్టులకు శిక్షా?

**- లాయర్లకు చట్టబద్ధమైన భద్రత..**
**జర్నలిస్టులకు మాత్రం బలిపశువుల పాత్రేనా?**
**- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో**
**జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు**




తెలంగాణ శాసనసభ వేదికగా తాజాగా ముగిసిన బడ్జెట్ సమావేశాలు రాష్ట్రంలోని పలు వర్గాలకు చట్టబద్ధమైన భరోసాను కల్పించినప్పటికీ, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచే జర్నలిస్టుల విషయంలో మాత్రం ప్రభుత్వం అత్యంత దారుణమైన వివక్షను ప్రదర్శించింది. మార్చి 30న ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో న్యాయవాదులకు, గిగ్ వర్కర్లకు మరియు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు రక్షణ కల్పించే చట్టాలను అత్యంత వేగంగా ఆమోదించిన పాలకులు, క్షేత్రస్థాయిలో ప్రాణాలకు తెగించి పనిచేసే జర్నలిస్టుల రక్షణ బిల్లును కనీసం ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇది పాలకుల ద్వంద్వ వైఖరిని మరియు మీడియా రంగాన్ని వారు కేవలం ఒక ప్రచార సాధనంగానే చూస్తున్నారనే చేదు నిజానికి అద్దం పడుతోంది.

### న్యాయవాదులకు భద్రత.. జర్నలిస్టులకు బలిపశువుల పాత్రేనా?

అసెంబ్లీలో అత్యంత ప్రాధాన్యతతో ఆమోదం పొందిన 'తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు – 2026' ద్వారా న్యాయవాదులకు వృత్తిపరమైన భరోసా దక్కింది. గతంలో జరిగిన పలు సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, న్యాయవాదులపై దాడులు చేస్తే కఠిన శిక్షలు విధించేలా, వారిపై తప్పుడు కేసులు నమోదు కాకుండా ముందస్తు విచారణ జరిపేలా ఈ చట్టం రూపొందించబడింది. న్యాయవాదుల రక్షణ విషయంలో చూపిన ఈ సానుకూల దృక్పథం, అదే స్థాయిలో సమాజం కోసం పోరాడే జర్నలిస్టుల విషయంలో ఎందుకు కరువైందన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. సమాజంలో ఇసుక మాఫియా, భూకబ్జాలు, రేషన్ బియ్యం అక్రమ దందాలను బయటపెట్టినప్పుడు జర్నలిస్టులపై భౌతిక దాడులు నిత్యకృత్యమయ్యాయి. అటువంటి సమయంలో అక్షర సైనికులను అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వం, వారిని అక్రమ కేసులు మరియు దాడులకు 'బలిపశువులను' చేస్తూ చట్టపరమైన రక్షణను నిరాకరించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు.

### నాలుగో స్తంభంపై నడిరోడ్డున ఖూనీ... ఇది కుట్ర కాదా?

రాష్ట్రంలో వార్తలు రాసినందుకు జర్నలిస్టులను వేధించడం, అక్రమంగా అరెస్టులు చేయడం మరియు దారుణంగా హత్యలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కలం గొంతు నొక్కితే పాలకుల వైఫల్యాలను ప్రశ్నించే వారు ఉండరనే ధీమాతోనే జర్నలిస్టుల రక్షణ బిల్లును అటకెక్కించారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు ఇప్పటికే జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను అమలు చేస్తుంటే, ప్రగతిశీల రాష్ట్రమని చెప్పుకునే తెలంగాణలో ఆ ఊసే ఎత్తకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందనే విమర్శలు వస్తున్నాయి. రక్షణ చట్టం లేకపోతే జర్నలిస్టులు భయపడి వాస్తవాలు రాయడం మానేస్తారని, అది కేవలం అవినీతిపరులకు, మాఫియా శక్తులకు మేలు చేస్తుందని జర్నలిస్టు లోకం ఆవేదన వ్యక్తం చేస్తోంది. అమ్ముడుపోని కలంపై అక్రమ కేసులు బనాయిస్తూ, వారిని మానసికంగా కుంగదీయడం పాలకుల అసహనానికి నిదర్శనం.

### గిగ్ వర్కర్లు - ఇతర వర్గాలకు రక్షణ కవచం

ఈ సమావేశాల్లో ప్రభుత్వం 'గిగ్ వర్కర్ల సంక్షేమ బిల్లు'ను ప్రవేశపెట్టి డెలివరీ బాయ్స్ మరియు డ్రైవర్లకు సామాజిక భద్రత కల్పించింది. అలాగే, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల జీతం నుండి కోత విధించే 'తల్లిదండ్రుల పోషణ బిల్లు'ను కూడా ఆమోదించింది. ఇవన్నీ ఆహ్వానించదగ్గ పరిణామాలే అయినప్పటికీ, సమాజం కోసం స్వారధిగా పనిచేస్తూ, ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధిగా ఉండే జర్నలిస్టుల సమస్యలను మాత్రం ప్రభుత్వం గాలికొదిలేసింది. కేవలం అక్రెడిటేషన్ కార్డుల పొడిగింపు లేదా ఆరోగ్య కార్డుల వంటి కంటితుడుపు చర్యలతో జర్నలిస్టులను మభ్యపెట్టాలని చూడటం వారిని అవమానించడమే. జర్నలిస్టులకు కావాల్సింది తాత్కాలిక ఊరటలు కాదు, విధి నిర్వహణలో వారికి లభించే శాశ్వత చట్టబద్ధమైన భద్రత.

### అసంఘటిత అక్షర సైనికులపై అణచివేత ధోరణి


ప్రభుత్వం ఇతర వర్గాలకు రక్షణ కల్పిస్తూ జర్నలిస్టులను విస్మరించడం వెనుక ఉన్న ప్రధాన కారణం వారిని అసంఘటిత శక్తిగా భావించడమే. న్యాయవాదులు లేదా ఇతర ఉద్యోగ సంఘాలు ఒక శక్తిగా ఏర్పడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినప్పుడు, వారి ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని పాలకులు తలొగ్గుతున్నారు. కానీ జర్నలిస్టులు వేర్వేరు యూనియన్లుగా చీలిపోవడం పాలకులకు వరంగా మారింది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని, వారి భద్రతను గాలికొదిలేయడం అత్యంత విచారకరం. ప్రశ్నించే గొంతును అణచివేయడం ద్వారా శాంతిభద్రతలను కాపాడలేమని ప్రభుత్వం గుర్తించాలి.

**తక్షణ డిమాండ్..వర్కింగ్ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్** ప్రభుత్వం ఇప్పటికైనా తన వివక్షను వీడి, జర్నలిస్టులకు చట్టబద్ధమైన భద్రతను కల్పించాల్సిన అవసరం ఉంది. న్యాయవాదుల చట్టం తరహాలోనే జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై నాన్–బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని, వారిపై కేసులు పెట్టే ముందు స్వతంత్ర కమిటీ విచారణ జరపాలనే నిబంధనలను తీసుకురావాలి. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే భారీ ఆర్థిక సాయం మరియు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భరోసా కల్పించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభం బలంగా ఉంటేనే సమాజం బాగుంటుందని, కలం కవాతు మొదలైతే అది ఏ శక్తినైనా గద్దె దించుతుందని పాలకులు గుర్తుంచుకోవాలి. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనైనా 'తెలంగాణ జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని' ప్రవేశపెట్టాలని మీడియా లోకం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తోంది. జర్నలిస్టుల సహనాన్ని పరీక్షించకుండా, వారి వృత్తి గౌరవానికి భంగం కలగకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.



- వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## గాయాలు నేర్పిన పాఠాలు



అగ్నిలోనూ ఆత్మను నిలబెట్టటం
నేర్చుకున్నా
దానిని ఆరనిదీపంలా మార్చటం
తెలుసుకున్నా।

కష్టాలకు కుళ్ళిపోతా అనుకున్నా
అవే నన్ను పుష్పింపజేశాయి
మట్టిలో పడి పోయిన గింజనైనా
మరలా మొలకెత్తే జీవమును అయ్యా।

కష్టాలు కరాళ రూపాలైనా
కలలకి కంచె కట్టలేవు
మనసు మేల్కొంటే ప్రతి నొప్పీ
మహాసాగరమై మార్గం
చూపించుతుంది।


కూలిపోను ఇక నిలబడతాను
కుమిలిపోను ఇక కవిత అవుతాను
కరిగిపోను ఇక కాంతి అవుతాను
కుళ్ళిపోను ఇక జీవం అవుతాను॥

కష్టాలకు కూలిపోతాను అనుకున్నా
కొండలా నిలబడటం నేర్చుకున్నా
కాలం కఠోరంగా కొట్టినా
కన్నీటి గుండెలో గర్వం పెంచుకున్నా।

కష్టాలకు కుమిలిపోతాను అనుకున్నా
కన్నీటిని కవితగా మార్చుకున్నా
మనసు ముక్కలైన ప్రతి క్షణం
తట్టుకున్నా
మౌనంలో మహోన్నత గాథ
రాసుకున్నా।

కష్టాలకు కరిగిపోతాను అనుకున్నా
వేదనలను వెచ్చదనం చేసుకున్నా

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.



## అమరావతి.. చట్టబద్ధత తర్వాత అసలు పరీక్ష



తెలుగువారు ఎదుగుదల దిశగా పయనిస్తుంటే, అదే తెలుగువారు అడ్డంకులుగా మారుతున్నారనే విమర్శ తరచూ వినిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశం ఈ వ్యాఖ్యకు ప్రత్యక్ష ఉదాహరణగా మారింది. రాష్ట్ర విభజన తర్వాత అభివృద్ధి దిశగా ముందుకు సాగాల్సిన సమయంలో, రాజధాని విషయంలో ఏర్పడిన అనిశ్చితి రాష్ట్ర భవిష్యత్తుపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తింది.

హైదరాబాద్ కోల్పోయిన తర్వాత, చెన్నై–బెంగళూరు వంటి మెట్రో నగరాల మధ్య ఆంధ్రప్రదేశ్ తన స్థానాన్ని ఎలా నిర్మించుకోవాలన్న ప్రశ్న కీలకమైంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా, ఆర్థిక–విద్యా హబ్‌గా తీర్చిదిద్దాలన్న ఆలోచన ముందుకు వచ్చింది. ముఖ్యంగా రైతుల సహకారంతో భూసమీకరణ ద్వారా వేల ఎకరాల భూమిని సమీకరించడం ఒక అరుదైన సామూహిక ప్రయోగంగా నిలిచింది.

అయితే 2019 తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు అమరావతి ప్రస్థానాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. రాజధాని విషయంలో విధానాల మార్పులు, అనిశ్చితి, రైతుల ఆందోళనలు అన్ని కలిపి ఒక అభివృద్ధి ప్రాజెక్టును రాజకీయ వివాదంగా మార్చాయి. రాజధాని నిర్మాణం కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాదు; అది ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే ప్రక్రియ కూడా. ఈ నమ్మకం దెబ్బతినడం రాష్ట్రానికి పెద్ద నష్టం.

ఇటీవల పార్లమెంట్ స్థాయిలో అమరావతికి లభించిన చట్టబద్ధత ఒక కీలక మలుపు. ఇది కేవలం ఒక పరిపాలనా నిర్ణయం కాదు; పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునరుద్ధరించే చర్య. గతంలో నెలకొన్న అనిశ్చితికి ఇది కొంతమేర ముగింపు పలికినా, అభివృద్ధి మార్గంలో ఉన్న సవాళ్లు మాత్రం ఇంకా పూర్తిగా తొలగిపోలేదు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి చట్టం రక్షణ ఇస్తుంది, కానీ అభివృద్ధిని నిర్మించేది కార్యాచరణ. అమరావతి శాశ్వత రాజధానిగా నిలవాలంటే, ప్రభుత్వం వేగవంతమైన మౌలిక సదుపాయాల నిర్మాణం, పారదర్శక విధానాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం అత్యంత ప్రాధాన్యం.

రాబోయే మూడు సంవత్సరాలు అమరావతి భవిష్యత్తును నిర్ణయించే కాలంగా మారవచ్చు. ఈ సమయంలో నిర్మాణ పనులు వేగవంతమవ్వాలి. అంతర్జాతీయ సంస్థలు, పరిశ్రమలు ముందుకు రావాలంటే, ప్రాథమిక వసతులు భద్రంగా ఉండాలి. లేకపోతే, చట్టబద్ధత ఉన్నా అభివృద్ధి ఆగిపోవచ్చు.

ఇక రాజకీయంగా కూడా అమరావతి అంశం ఇంకా సున్నితంగానే ఉంది. భిన్న అభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, రాష్ట్ర ప్రయోజనం ముందు రాజకీయ లాభనష్టాలు చిన్నవిగా భావించాలి. రాజధాని అంశాన్ని రాజకీయ ప్రయోగాల వేదికగా మార్చడం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు ప్రమాదకరం.

అమరావతి కేవలం ఒక నగరం కాదు.. అది కోట్లాది ప్రజల ఆశలు, వేలాది రైతుల త్యాగాల ప్రతీక. ఈ ప్రాజెక్ట్ విజయవంతం అయితేనే ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా, సామాజికంగా బలపడుతుంది.

**చివరగా చెప్పాల్సినది ఒక్కటే**

చట్టబద్ధతతో ప్రయాణం మొదలైంది, కానీ విజయం సాధించాలంటే సంకల్పం, స్థిరత్వం, సామూహిక బాధ్యత అవసరం.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 07.04.2026
www.mudranews.in | @mudranews



**పచ్చిమిర్చి గాలి వచ్చేలా ఆరనివ్వాలి**

జల్లెడ లేదా క్లాత్‌పై వేసి సహజంగా ఆరబెట్టండి. ఇది మిర్చి మెత్తబడకుండా కాపాడుతుంది.



# తాగునీటి సంక్షోభానికి చెక్

**పాలమూరులో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన**
**ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన విప్ ఎన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**పాలమూరులో తాగునీటి ఎద్దడి నివారణ కు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శ్రీకారం చుట్టారు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా పలు డివిజన్లలో అధునాతన ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. నగరంలో మొత్తం మీదుగా 14 ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుతం నాలుగు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీలైనంత త్వరలో మిగతా ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణపు పనులకు శంకుసాపన చేస్తామని స్పష్టం చేశారు. నగరంలోని ప్రతి ప్రాంతానికి సమానంగా, నాణ్యమైన తాగునీరు అందేలా కృషి చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారానే నగర అభివృద్ధి సాధ్యమని, తాగునీటి సమస్య పరిష్కారం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన



పేర్కొన్నారు. నీటి నిల్వ, శుద్ధి, సరఫరా వ్యవస్థలను సమన్వయపరచే విధంగా ప్రణాళిక రూపొందించబడిందని, భవిష్యత్‌లో జనాభా పెరుగుదల, పట్టణ విస్తరణ వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ ట్యాంకుల సామర్థ్యాలను నిర్ణయించామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు బీంగి వెన్నెల రఘు, కిషన్ నాయక్, యాదగిరి, పెద్ద గొల్ల నర్సింహులు, తిరుమల వెంకటేష్, పాండు రంగారెడ్డి, నాయకులు మైత్రి యాదయ్య, రఘు, సతీష్ కుమార్, నరేష్, తదితరులు పాల్గొన్నారు. విజయ డైయిరీ ఉత్పత్తుల ఔట్‌లెట్ కేంద్రాన్ని ప్రారంభించారు. నవజాత శిశువుల తల్లులకు యెన్నం హెల్త్ కిట్ లు, యెన్నం హెల్త్ కార్డు లను పంపిణీ చేశారు. మహబూబ్ నగర్ లోని షాషాబ్ గుట్టలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు . ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా సమాజంలోని బలహీన వర్గాలకు భద్రమైన నివాసాన్ని కల్పించడం జరుగుతోందని, ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు.

## టీచర్ ను సస్పెండ్ చేయాలి

**ముద్ర, నారాయణపేట:** జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర వసతి గృహంలో విద్యార్థులపై అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు నరేష్, సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీ గురుకుల బాలుర హాస్టల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులపై సిరాజ్దిన్ అనే టీచర్ అసభ్యంగా ప్రవర్తిస్తూ విద్యార్థులు రాత్రి నిద్రించిన సమయంలో వికృత చేష్టలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. విషయం తెలుసుకునేందుకు మైనార్టీ హాస్టల్ కు వెళ్ళిన విద్యార్థి సంఘం నాయకులకు హాస్టల్ ప్రిన్సిపల్ పొంతన లేని సమాధానం చెప్పారని హాస్టల్ ప్రిన్సిపాల్ ఖాజమైనుద్దీన్ పైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సంక్షిప్తంగా..

### ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మెప్మా, ఏపీపీసీ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్యాం ప్రసాద్ లాల్ ప్రారంభించారు. ఏపీపీసీ అధ్యక్షులు జహంగీర్ పాషా, కార్యదర్శి అజారుద్దీన్, ఈ కార్యక్రమంలో డీఎంసీ ఎం. శ్వేత, టీఎంసీ పి. శంకర్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ గా మల్లేశం

**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు అడ్వకేట్ మనోహర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, బిజెపి కౌన్సిలర్లు అంతారం కిరణ్, శ్రీకాంత్ రెడ్డి, పార్టీ నాయకులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

### ఈవీఎంల పరిశీలన

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ఈవీఎం గోదాంను నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్ని ప్రమాద నివారణ చర్యతతలు, డబుల్ లాక్ వ్యవస్థ వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

**వికారాబాద్‌లో..**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ దీపక్ తివారి సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమములో ఆర్ డి ఓ వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మి నారాయణ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హోలీ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### బీజేపీ కౌన్సిలర్లకు సన్మానం

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వికారాబాద్ మున్సిపల్లో బీజేపీ కౌన్సిలర్లు అనిల్ యాదవ్, స్రవంతి శ్యామ్ రెడ్డి, రుచిత సాయిచరణ్ రెడ్డి, లావణ్య సురేందర్ ను వికారాబాద్ బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ వద్ద నందు సన్మానించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి, మల్లా రెడ్డి, నర్సిములు, రాంచందర్ పాల్గొన్నారు.

### మెకానిక్ కుటుంబానికి ఆర్థికసాయం

**ముద్ర, గద్వాల:** అయిజ మండలం చిన్న తండ్రపాడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టూవీలర్ మెకానిక్ బోయ సత్యం కుటుంబానికి జిల్లా టూవీలర్ బైక్ మెకానిక్ సంఘం నాయకులు బాధిత కుటుంబసభ్యులకు రూ.33 వేల ఆర్థికసాయం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గడ్డమీది నాగిరెడ్డి జనరల్ సెక్రటరీ రాజేందర్ రెడ్డి, గద్వాల టౌన్ అధ్యక్షుడు సుభాన్ ,ఇక్బాల్, మధు, హరీష్, షబ్బీర్ పాల్గొన్నారు.

### మజ్జిగ పంపిణీ

**ముద్ర కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఉన్న చలివేంద్రం దగ్గర కాంగ్రెస్ నాయకుల సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ పిడికిటి గోపాల్ చౌదరి, తుమ్మల మోహన్ కుమార్, వెంకట్, వీరబాబు, అరవింద్ పాల్గొన్నారు

### ఘనంగా హరివర్ధన్ రెడ్డి పుట్టినరోజు

**ముద్ర, కూకట్‌పల్లి :** కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు కండ్లకోయలోని నిమ్మల కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని సందడి చేశారు.

# హెల్త్ వీక్ కార్యక్రమాలకు శ్రీకారం

**– 'ఈట్ రైట్ – వాక్'తో అవగాహన ర్యాలీలు**









**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలో హెల్త్ వీక్ కార్యక్రమాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుండి వైద్య ఆరోగ్యశాఖ, ఫుడ్ సేఫ్టీ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఈట్ రైట్ – వాక్' అవగాహన ర్యాలీని కలెక్టర్ బాదావత్ సంతోష్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, అధికారులు పాల్గొన్న ఈ ర్యాలీ అంబేద్కర్ కూడలి వరకు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీలత, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

**గద్వాలలో..**

**ముద్ర,గద్వాల:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం ఫుడ్ సేఫ్టీ దినోత్సవం నిర్వహించారు. గద్వాల గాంధీ చౌక్ లోని పాత డిఎంహెచ్వో కార్యాలయం వద్ద అదనపు కలెక్టర్ నర్సింగరావు జెండా ఊపి ఫుడ్ సేఫ్టీ కి సంబంధించిన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఫుడ్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ మధుసూదన్ రెడ్డి, సీసీ వెంకటేష్, జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్ లో ..**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారానే మెరుగైన జీవనం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ ఆహారంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంగం లక్ష్మి బాయి ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ దిపక్ తివారి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అంగన్వాడి టీచర్లు, ఎస్సీ, ఎస్సిటి , బి సి వెల్ఫేర్ ఆఫీసర్స్ వార్డెన్స్ కు ఫుడ్ సేఫ్టీ పైన అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో జాడ్ పి సి ఇ ఓ సుదీర్, డి ఎం హెచ్ ఓ స్వర్ణ కుమారి, ఫుడ్ సేఫ్టీ అధికారి జగన్నాథం, విద్యార్థినిలు, పోలీస్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధి

**నాగర్ కర్నూల్ మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ మున్సిపల్ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. రోడ్ల అభివృద్ధికి ఇప్పటికే రూ.56 కోట్లు వ్యయం చేసి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం రూ.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా నాగర్ కర్నూల్ అభివృద్ధికి తాను పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్ నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్ మరియు కౌన్సిలర్లు కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కౌన్సిల్ మీటింగ్ హాల్ నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేయించేందుకు హామీ ఇచ్చారు.

## లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే

**ముద్ర, తాండూర్:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు వేద పండితులు వేదాశీర్వచనం చేసి, స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** బాధితుల సమస్యల దిశగా, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువాయే దిశగా పనిచేయాలని జిల్లా ఎస్పీటి. శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి 15 ఫిర్యాదులు స్వీకరించారు. ఏవో చంద్రశేఖర్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో 8 ఫిర్యాదులు**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ 8 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, చట్టప్రకారం తక్షణ పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు

# మంత్రాలయం రాఘవేంద్ర స్వామి భూముల ఆక్రమణ

**చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు**

**ముద్ర, గద్వాల:** మంత్రాలయంలో గల శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి చెందిన అత్యంత విలువైన భూములు ఆక్రమణకు గురయ్యాయని మఠం భూములను కొందరు అక్రమార్కులు రాజకీయ అండదండలతో ఆక్రమించుకుని, సాగు చేయడమే కాకుండా శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారని ఉలిగేపల్లి గ్రామ యువత ఆరోపించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఆలయ భూములను రక్షించాలంటూ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ భూముల రికార్డులు తారుమారు చేసి అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ తక్షణమే స్పందించి శ్రీరాఘవేంద్ర స్వామి మఠం భూములను కబ్జాకోరుల నుంచి పరిరక్షించాలని కోరినట్లు గ్రామస్తులు తెలిపారు.



**ప్రజావాణిలో 50 దరఖాస్తులు స్వీకరణ**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 50 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి.వి. శ్యాంప్రసాద్ లాల్, అమరేందర్, జెడ్పీ సీఈ‌ఓ పాల్గొన్నారు.




**వికారాబాద్‌లో..**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన "ప్రజావాణి" దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఆర్ డి ఓ మంగీ లాల్, జడ్ పి సి ఇ ఓ సుధీర్, ఆర్ డి ఓ వాసు చంద్ర,డిఆర్డిఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**హైకోర్టు న్యాయమూర్తికి విద్యార్థుల పోస్టుకార్డుల విన్నపం**

**ముద్ర కూకట్‌పల్లి :** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. జేఎన్టీయూలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థి నేతలు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవికి పోస్టుకార్డులు పంపిస్తూ తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాగర్ నాయక్, రాజ్ కుమార్, రుత్విక్, ధనుంజయ్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్రస్థాయి ఎంపికకు 20 మంది

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రాష్ట్ర క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎంపికకు జిల్లాలోని 20 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి వి. సీతారాం తెలిపారు. వీరిలో 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఉండడం విశేషం. బాలికలు: టి. అనన్య నందిని (అమ్రాబాద్), జి. నేహా (ఉప్పునుంతల), పి. విశ్వకీర్తి (కొల్లాపూర్), జె. నైమిష (బిజినేపల్లి), వి. అక్షయ (కొడేర్), ఈ. తేజశ్విని (కల్వకుర్తి), బి. లౌక్య శ్రీ (బిజినేపల్లి), పి. సన్విత (తాడూరు), ఎ. మౌనిక (తెల్కపల్లి), కె. శ్రేష్ఠ శ్రీ (కొల్లాపూర్).బాలురు: ఎం. యోగాన్ష్ (వంగూర్), ఎస్. మహేందర్ (నాగర్ కర్నూల్), పి. హైగ్రీవ్ (కల్వకుర్తి), ఎ. రిత్విక్ (బాల్మూర్), జె. శ్రీనాథు (నాగర్ కర్నూల్), బి. స్వరాజ్ దీక్షిత్ (అచ్చంపేట), బి. అనిరుధ్ (లింగల్), ఎస్. చంద్రన్ కుమార్ (కొల్లాపూర్), బి. శివకుమార్ (ఉర్కొండ), వి. శ్రేయస్ యాదవ్ (తిమ్మాజిపేట).

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం





**ముద్ర, మల్కాజిగిరి:** భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి లో మెగా మెడికల్ క్యాంప్ సోమవారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో నిర్వహించి1 కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సన్ డెంటల్ కేర్ ఆసుపత్రిలో స్వదేశీ సాంకేతికతతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపొందించిన 'స్కాన్ ఓ' డెంటల్ మెషిన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు, ఈటెల రాజేందర్ మాట్లాడుతూ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన వైద్య పరికరాలను ప్రజలు ప్రోత్సహించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి 'స్వస్థ భారత్' లక్ష్యానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నాయకులు రాంబాబు, ఆర్‌కే శ్రీనివాస్, ప్రభు గుప్తా, బాలింగం, గోపు రమణా రెడ్డి, లీలావతి, వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

**తాండూర్‌లో..**

**ముద్ర, తాండూర్:** తాండూరు బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నాగారం మల్లేశం గారి ఆధ్వర్యంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవం తాండూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలి అంబేద్కర్ చౌక్ వాల్మీకి నగర్, ఎంపీటీహాల్ వద్ద ఆయా వార్డుల చెందిన కౌన్సిలర్లు బిజెపి జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సాహుశ్రీలత, జిల్లా నాయకులు పటేల్ విజయ్ కుమార్ బంటారం భద్రేశ్వర్ కౌన్సిలర్లు శ్రీకాంత్ రెడ్డి, అంతారం కిరణ్, నాగారం మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు బండారి శ్రీకాంత్ ఇందూర్ రాములు, రూపేష్ కుమార్ పట్టణ ప్రధాన కార్యదర్శి మంతటి రాజు ఉపాధ్యక్షులు చిద్దిరి ప్రకాష్ కమిటీ సభ్యులు ప్రభాకర్ గౌడ్ చాకలి బిచ్చప్ప కృష్ణ పటేల్ చందు వడ్డే సాయిలు బసవరాజ్ బబ్లు శివాజీ ఠాగూర్ పాల్గొన్నారు.

**కూకట్‌పల్లిలో ..**

**ముద్ర, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేశం, ధర్మం, మరియు చివరి వ్యక్తి సంక్షేమమే లక్ష్యంగా పుట్టిన బీజేపీ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని కొనియాడారు.

## పేద వర్గాల పార్టీ సీపీఐ ని కాపాడుకుందాం

**ముద్ర, కాప్రా:** పేద వర్గాల పార్టీ సిపిఐ ని కాపాడుకుందామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వియస్. బోస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటికి సిపిఐ కార్యక్రమం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఏఎస్ రావు నగర్ డివిజన్ లో మాట్లాడారు. కార్యక్రమంలో సీపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి ,ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు పాల్గొన్నారు.

## జీతాలలో కోతలు విధించడం అన్యాయం

**ముద్ర ప్రతినిధి, మేడ్చల్ జిల్లా :** ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల జీతాల్లో కోత విధించడం సమంజసం కాదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ అన్నారు. వెంటనే వారీ వారి ఖాతాలలో జమ చేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కు, డిఎంహెచ్ఓకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఏఎన్ఎం యూనియన్ ఏఐటీయూసీ) రాష్ట్ర కోశాధికారి ఎస్. రాజేశ్వరి రెడ్డి, రాష్ట్ర నాయకురాలు మెటల్డా, కే అనిత, మంగ, అన్నపూర్ణ, డీఈవోల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 07.04.2026
www.mudranews.in | @mudranews



**పచ్చిమిర్చి తొడిమలు తీసేయాలి**

తొడిమల దగ్గరే కుళ్లు ఎక్కువగా మొదలవుతుంది. అందుకే ఆరిన తర్వాత వాటిని తొలగించాలి.



# గ్రామాలకు వస్తా.. సమస్యలు పరిష్కరిస్తా..



**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**- వెల్గటూర్ లో కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**ముద్ర, కరీంనగర్ (వెల్గటూర్):**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సోమవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎండపల్లి, వెల్గటూర్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేయాలని, ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తర్వాత పార్టీలకు తీతంగా ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వచ్చి సమస్యలు గుర్తించడంతో పాటు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎండపల్లి, వెల్గటూర్ మండలాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి అందజేశారు. వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు చేయించుకున్న 78 లబ్ధిదారులకు రూ. 25.40 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ముగ్గురు దివ్యాంగులకు స్కూటీలు అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి ఉత్సవ సమితి ఏర్పాటు

**మహాదేవపూర్, ముద్ర:** మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు ఉత్సవ సమితిని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా లింగాల రామయ్య, ఉపాధ్యక్షుడిగా నల్లభాగ ధర్మయ్య, కార్యదర్శులుగా బెల్లంపల్లి సురేష్, మెరుగు లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నిరసన

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
పట్టణంలోని సెయింట్ థామస్ హై స్కూల్ ఎస్సెస్సీ మూల్యాంకన కేంద్రంలో సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ గతేడాది ఎస్సెస్సీ మూల్యాంకన పారితోషికం ఇప్పటి వరకరు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో పారితోషికం చెల్లించినప్పటికీ నిర్మల్ లో ఇవ్వలేదన్నారు. తమ ఖాతాల్లో పారితోషికం బదిలీ కాని పక్షంలో స్పాట్ విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఉప క్యాంపు అధికారి పరమేశ్వర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, టీయూటీఎఫ్ అధ్యక్షుడు తోడిశెట్టి రవికాంత్, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షుడు చక్రాల హరి ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేష్ నాయక్, క్రాంతి కుమార్, టీఆర్టీఎఫ్ అధ్యక్షుడు దర్శనం దేవేందర్, డీటీఎఫ్ అధ్యక్షుడు శ్రీకాంత్ చారి, తపస్ అధ్యక్షుడు శశిరాజ్, వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్యాంపస్ డ్రైవ్ కు స్పందన

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో సోమవారం నిర్వహించిన మెగా క్యాంపస్ డ్రైవ్ కు అనూహ్య స్పందన లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణ తెలిపారు. ప్రముఖ ఎంఎన్సీ కంపెనీలు అయిన టెక్ మహీంద్రా, సజిలిటీ, డిజిటైడ్, ఫస్ట్ సోర్స్ వంటి సంస్థలతో పాటు ఎల్ఎంఎస్ కార్పొరేట్ టెక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి టెక్నాలజీస్, టాల్ బ్రిడ్జ్, టీమ్లీజ్, కోజెంట్, ముత్తూట్ ఫైనాన్స్, సుభాగృహ ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మెరీనా పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ సంస్థలు, మ్యాజిక్ బస్ టాస్క్ ప్రతినిధులు పాల్గొన్నారు. కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ జి. నీరజ మాట్లాడుతూ 263 మంది అభ్య ర్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీనియామక పత్రాలు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డా. టి. ప్రమోద్ కుమార్, డా. జి. చంద్రయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. యన్. వాసవితో పాటు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో అస్తవ్యస్తంగా నీటి సరఫరా

**- డ్యామ్లో నీళ్లున్నా.. గొంతులెందుకు ఎండుతున్నాయి**
**- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి**
**- మాజీ మేయర్ రవీందర్ సింగ్**

**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ నగరపాలక సంస్థలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, పాలకుల చేతకానితనం వల్లే నగర ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ ధ్వజమెత్తారు. సోమవారం నగరంలోని మున్సిపల్ ఫిల్టర్ బెడ్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న అపరిశుభ్రత, నిర్వహణ లోపాలను చూసి అధికారులపై మండిపడ్డారు.



**అధికారుల నిర్లక్ష్యం..**

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాలకులు, అధికారుల తీరును ఖండించారు. మానేరు డ్యామ్లో ప్రస్తుతం 7.5 టీఎంసీల నీరు ఉందన్నారు. కాని ప్రజలకు రెండు రోజులకు ఒకసారి, కేవలం 20 నిమిషాలే నీటిని వదలడం వెనుక ఉన్న మర్మమేంటి అని ప్రశ్నించారు. గతంలో నిత్యం నీరందించిన ఘనత తమదని చెప్పారు. నేడు పాలన కుంటుపడటంతో నగర వాసులు చుక్క నీటి కోసం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**నీరు తగ్గితే వారానికోసారి ఇస్తారా?**

డ్యామ్లో 7.5 టీఎంసీలు ఉన్నప్పుడే రెండు రోజులకు ఒకసారి నీరిస్తుంటే.. మరి కొద్ది రోజుల్లో ఎండలు ముదిరి నీటి మట్టం 3 టీఎంసీలకు పడిపోతే, అప్పుడు వారానికి ఒకసారి నీరిస్తారా అని ఎద్దేవా చేశారు.

14, 34, 36 ఎంఎల్డీల పంపు హౌస్లను పట్టించుకునే నాథుడే లేదన్నారు. రెండేళ్లుగా ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్చకుండా ప్రజలకు కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. నిర్ల క్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు.

**బండి సంజయ్ ఎక్కడున్నారు?**

గత ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికి ప్రతిరోజూ నీరు అందిస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ బండి సంజయ్ ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. మీ హామీలు నీటి మూటలేనా అని విమర్శించారు.

**అమృత్ నిధులు ఏమయ్యాయి?**

కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా కేటాయించిన కోట్లాది రూపాయల నిధులను సద్వినియోగం చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందని రవీందర్ సింగ్ ఆరోపించారు. రెండు వేల కేఎల్ సామర్థ్యం గల ప్రాజెక్టులు ఏడాది దాటినా అసంపూర్తిగా ఎందుకున్నాయని నిలదీశారు. మూడు ఆన్లైన్ బూస్టర్లు ఉన్నా ఫలితం శూన్యమని, నీటి సరఫరాపై మున్సిపల్ అధికారులకు కనీస ప్రణాళిక లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


**ఉద్యమిస్తాం..**

ఉత్తర తెలంగాణకే ఆదర్శంగా ఉండాల్సిన కరీంనగర్ కార్పొరేషన్ నేడు పాలనా లోపంతో వెనుకబడిందని ఆరోపించారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వేసవిలో ప్రజల దాహం తీర్చడంలో వైఫల్యం చెందితే, నగర ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ముద్ర, గొల్లపల్లి:**
అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడమే తమ లక్ష్యమని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. గొల్లపల్లి మండలం చిల్వకోడూరు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం మంత్రి కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గొల్లపల్లి మండలానికి చెందిన 24



మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి పథకం చెక్కులను. అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 107 మందికి లబ్ధిదారులకు రూ.28 లక్షల 6వేల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు.

చిల్వకోడూరు గ్రామానికి చెందిన కాసా లక్ష్మీరాజం కు రూ.3 లక్షల ఎల్ ఓసీని అందజేశారు. అనంతరం చిల్వకోడూరులో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజాగౌడ్**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో పలు సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై 123 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు వారి సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని తెలిపారు. అధికారులు వారి శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించాలన్నారు. సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, నరసింహారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం

**- సీఎం రేవంత్ రెడ్డి - ముద్ర కథనానికి స్పందన**


యూనివర్సిటీ ఏర్పాటుపై స్పష్టత వచ్చేనా?
- నేడు ఆదిలాబాద్ జిల్లాలో సీఎం పర్యటన
- విశ్వవిద్యాలయం కోసం ఉమ్మడి జిల్లావాసుల ఎదురుచూపు
ఆదిలాబాద్ లో సమావేశమైన యూనివర్సిటీ సాధన సమితి (ఫైల్)

**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లాలో త్వరలోనే యూనివర్సిటీనీ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుపై స్పష్టత వచ్చేనా అనే శీర్షికతో సోమవారం ముద్ర పత్రిక లో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. సోమవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో జరిగిన ప్రజా పాలన – ప్రగతి బాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు పై స్పష్టత ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో త్వరలోనే యూనివర్సిటీనీ ఏర్పాటు చేస్తామని, ఇందుకు సంబంధించిన భూ సేకరణతో పాటు ఏర్పాటుపై ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. త్వరలోనే యూనివర్సిటీ ఏర్పాటు కార్యక్రమానికి తానే వస్తానని అన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు పై నెలకొన్న సందిగ్ధత సీఎం తాజా ప్రకటనతో తొలగిపోయింది.

# బీజేపీతోనే విప్లవాత్మక సంస్కరణలు..



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** విప్లవాత్మక సంస్కరణలు బీజేపీ తోనే సాధ్యమని ఆ పార్టీ ఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ హయాంలోని బీజేపీ ప్రభుత్వం అంతర్జాతీయంగా మన్ననలు అందుకుంటోందన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. సత్యనారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, బీజేపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**పార్టీ కార్యాలయంలో..**

పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో 47వ స్థాపన దివస్ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు రాష్ట్ర నాయకులు అయ్యన్న గారి భూమయ్య, కూనింటి అంజకుమార్ రెడ్డి, మల్లిఖార్జున్ రెడ్డి, మెడిశెమ్మే రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు యాతాళం చిన్నారెడ్డి, నల్లా రవీందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మాదిరే శ్రీనివాస్, ఆఫీస్ కార్యదర్శి అల్లం భాస్కర్, పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొండాజీ శ్రవణ్, గిల్లి విజయ్, పట్టణ ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజు, సీనియర్ నాయకులు ఆడెపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ పారదర్శకంగా నిర్వహించాలి

**మహాదేవపూర్, ముద్ర:** చిన్న కాలేశ్వరం ప్రాజెక్టు భూసేకరణను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు..సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో భూ సేకరణ ప్రక్రియపై రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ మరియు మేఘా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎస్డీసి రమేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమకుమారి, ఇరిగేషన్, రెవెన్యూ, మెగా అధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండండి

**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సోమవారం బోథ్ నియోజకవర్గం లోని పిప్పిరి లో జరిగిన బహిరంగ సభలో సీఎం దృష్టికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పలు సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బోథ్లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు దగ్గర చేయాలని,బుగ్గారం, సుంకిడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు 22 కొత్త చెరువుల నిర్మాణం, 18 చెరువులకు మరమ్మతులతో పాటు 23 చెక్ డ్యాం ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

**కోరుట్ల, ముద్ర:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించి 46 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కోరుట్ల లోని శ్రీ వేంకటేశ్వర ఆలయం వద్ద బిజెపి జెండా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుప్ రావు, రాష్ట్ర ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, పాల్గొని భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సమావేశంలో అల్లాడి ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీ నారాయణ, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్ చెట్లపెల్లి సాగర్ కౌన్సిలర్ తిరుమల వాసు, గుగులోతు శ్రీకాంత్, బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

**మహాదేవపూర్ లో..**

**మహాదేవపూర్, ముద్ర:** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు రామ్ శెట్టి మనోజ్ మాట్లాడుతూ భా రతీయ జనతా పార్టీ 1980 వ సంవత్సరంలో ఏప్రిల్ 6 న స్థాపించబడి అంత్యోదయ లక్ష్యంతో ఏకత్మాత మానవవాదం సిద్దాంతంగా పనిచేస్తూ నేడు ప్రపంచంలో అతి పెద్ద పార్టీ గా అవతరించిందని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆన్కారి రాజేందర్, ఓబీసీ మోర్చా ప్రెసిడెంట్ చాగర్ల రవి, వార్డ్ సభ్యులు సోన్నారి శ్యామ్, మండల నాయకులు కన్నెబోయిన ఐలయ్య, దడిగెల వెంకటేష్, నాగుల సాయి, రాజు, రాకేష్, అర్జున్, లక్కీ, జనసేన నాయకులు అవినాష్, రాజేష్, అభిమానులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 07-04-2026
www.mudranews.in | @mudranews



**పచ్చిమిర్చి తొడిమ తీసిన తర్వాత కడగకండి**

మళ్లీ కడిగితే నీరు లోపలికి వెళ్లి పాడవుతుంది. ఈ చిన్న తప్పు వల్లే మిర్చి త్వరగా చెడిపోతుంది.



## ఎస్సారెస్పీ నీళ్లు ఏప్రిల్ నెలాఖరు వరకు ఇవ్వాలి

- రైతు భరోసా ఒకేసారి ఇవ్వాలి
- రైతు బీమా అమలు చేయాలి
- బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో..



ముద్ర, తుంగతుర్తి: తుంగతుర్తి నియోజకవర్గ రైతుల పంటలు కాపాడే విధంగా ఏప్రిల్ నెల చివరి దాకా ఎస్సారెస్పీ కాలువల ద్వారా గోదావరి జలాలు విడుదల చేయాలని తుంగతుర్తిలో టీఆర్ఎస్ శ్రేణులు సోమవారం నిరసన తెలుపుతూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ యాసంగి రైతు భరోసా ఒకేసారి ఇవ్వాలని. రైతుభీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాలువ నీళ్ళను బందు చేయడం వలన మండలంలో 20 శాతం పంటలు నిండు పొట్ట దశలో ఉండి ఎండిపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ అధికారులకు తెలియ పరచినప్పటికీ కలెక్టర్ సైతం ఇప్పటి వరకు స్పందించ లేదని అన్నారు. ఎమ్మెల్యే మందుల సామెల్ సాగునీరు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో ఉన్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాట్లాడి నీరు విడుదల చేయాలని డిమాండ్ చేసారు.. రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన శాస్తి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ మండల నాయకులు గుండగాని దుర్గయ్య గాజుల యాదగిరి సర్పంచ్ లు మనోజ్ ఎల్లయ్య. కర్ణాకర్. మాజీ ఎంపీటీసీ నరేష్ నాయక్. మాజీ సర్పంచ్ విరోజీ నాయక్. తడక మళ్ళ రవి కుమార్. నాగమల్లు మహేందర్. భాస్కర్. సైదులు క్రాంతి. జాని, ధర్మానాయక. తునికిలక్ష్మి . బిక్షం.. సూరయ్య. వీరన్న. సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి' దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, భువనగిరి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి ప్రజల నుండి 57 అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 35, జిల్లా గ్రామీణ అభివృద్ధి 8, ఉపాధి కల్పన 2, మున్సిపాలిటీ 2, పంచాయతీ 2, విద్య, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ ,దేవాదాయ, ఆర్.టి.సి, చేనేత, నేషనల్ హైవే, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఓ ఫిర్యాదుదారుడు దివ్యాంగుడి వద్దకు వెళ్లిన కలెక్టర్ స్వయంగా దరఖాస్తు స్వీకరించి కొంతసేపు ఆయనతో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఎస్పీ కె నరసింహ



ముద్ర, సూర్యాపేట: ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ నరసింహ సూచించారు. పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పోలీస్ కార్యాలయంలో పిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుండి వచ్చిన పిర్యాదుదారుల నుండి పిర్యాదులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## దళితబంధు నిధులు విడుదల చేయాలి

ముద్ర, మోత్కూర్: అడ్డగూడూర్, మోత్కూర్ మండలాల రెండవ విడత దళిత బంధులో భాగంగా లబ్దిదారుల ఖాతాలో ఉన్న 3 లక్షలతో పాటు మిగతా రూ.7 లక్షలు డబ్బులు వెంటనే గ్రౌండింగ్ చేసి అందజేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం అందజేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిపల్లపల్లి మహేంద్రనాథ్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్ ఆధ్వర్యంలో కలెక్టర్ ను కలిశారు. స్పందించిన కలెక్టర్, ఈడీని వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు లబిదారులు చెడిపల్లి రఘుపతి,బంగారయ్య, అంజయ్య, మహేందర్ కూరెళ్ళ రమేష్, బాలెంల నరేందర్, జిల్లా శివాజీ, జక్కుల గిరి, ఇటీకాల సుధాకర్, కూరెళ్ళ మహేష్, కూరెళ్ళ నాగరాజు, రుద్రపల్లి గణేష్, బండి వెంకన్న, సూరారం రాజు, ముక్కెర్ల రమేష్, మెంట ఎల్లయ్య, చెడిపెల్లి ఆనంద్, కడియం స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులు బంద్ చేయాలని మహిళల ధర్నా

ముద్ర, మోత్కూర్: గ్రామాలలో బెల్టు షాపులను బంద్ చేయాలని సోమవారం ఎక్సైజ్ ఆఫీసు ఎదుట మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని, మహిళలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని మండిపడ్డారు. బెల్ట్ షాపులు బంద్ చేయకపోతే మహిళలు వైన్స్ మీద కూడా దాడి చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో అనిత, నర్సమ్మ, శోభ, ఉపేంద్ర ధనమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు

## మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



ముద్ర, ఖమ్మం: జిల్లాలోని ఎరుపాలెం మండలం మీనవోలు గ్రామంలో ఆదివారం ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి 60 క్రికెట్ టీంలు ఈ టోర్నమెంట్ లో పాల్గొంటున్నాయి. మీనవోలు గ్రామంలోని పిల్లి బోసు గ్రౌండ్ లో టోర్నీ ప్రారంభం కాగా తొలి రోజు మూడు టీంలు మధ్య పోటీలు జరిగాయి. తొలి రోజు ఎరుపాలెం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం క్రికెట్ టీం, మధిర మండలంలోని ఇల్లూరు టీం మధ్య పోటీ జరగగా బుచ్చిరెడ్డిపాలెం గెలిచింది.

మీనవోలు టీం ఖమ్మం ఈగల్ టీం మధ్య పోటీ జరగగా ఖమ్మం ఈగల్ టీం విజేతగా నిలిచింది. ఆఖరి మూడవ మ్యాచ్ గంపలగూడెం, మధిర ముస్లిం కాలనీ క్రికెట్ టీంల మధ్య జరిగిన పోటీలో ముస్లిం కాలనీ గెలుపొందింది.

ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ ఇషా తీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్ సాహెబ్ లు ఈ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించగా కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా మండల ముస్లిం ఐక్య సంఘం నాయకులు, పలువురు గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## ధర్మా టీచర్స్ యూనిటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ముద్ర ప్రతినిధి, భువనగిరి: ధర్మా టీచర్స్ యూనిటీ క్యాలెండర్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈఓ సత్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిటియు కన్వీనర్ ఎర్ర సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషన్ సమర్పించిన సిఫార్సులను సవరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎర్ర సుధాకర్, సభ్యులు దప్పు బిక్షమయ్య, పి.మహేష్, చింత యాదగిరి పాల్గొన్నారు.

## మహిళా సంఘాల సభ్యుల ఆందోళన

ముద్ర ప్రతినిధి, భువనగిరి: భువనగిరి పట్టణంలో మహిళా సంఘాల డబ్బులను ఆర్పీలు సువర్ణ, దివ్య సభ్యులకు తెలియకుండా డ్రా చేసి సొంతానికి వాడుకున్నారని, వారిని కఠినంగా శిక్షించాలని హనుమాన్ వాడ మహిళా సంఘాల సభ్యులు సోమవారం రాత్రి ఆందోళన దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతకాల ఫోర్జరీ చేసి సభ్యులు లేకుండానే ఆర్పీల చేతులకు డబ్బులను ఇచ్చిన కెనరా బ్యాంక్ ఇంచార్జ్ రమేష్ బాబు, కెనరా బ్యాంక్ సిబ్బందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో సంఘానికి సంబంధించి రూ.20 లక్షల వరకు డ్రా చేసుకున్న ఆర్పీలు, కోట్ల రూపాయల నిధులను సొంతానికి వాడుకున్నారని వారిని ఎక్కడ ఉన్న పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## టెండర్లు రద్దు చేయాలి

- తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్

ముద్ర మోత్కూర్: టెండర్లు రద్దు చేసి టెస్కో నుండే గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఏక రూప దుస్తులు, దుప్పట్లు, కొనుగోలు చేయాలనీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెండర్లు రద్దు చేయకపోతే ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. విద్యా శాఖ 2026-27 విద్యా సంవత్సరంలో గురుకుల విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారీకి రూ. 105.54 కోట్ల ఆర్డర్ ను ప్రభుత్వ రంగ సంస్థ టెస్కోకు ఇచ్చిన ఆర్డర్ ను రద్దు చేసిందన్నారు. ప్రయివేట్ వ్యక్తుల దగ్గర కొనుగోలు చేయుటకు విద్యా శాఖ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికుల ఉపాధిని ఊడగొట్టడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముషం నరహరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరపాటి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు పసునూరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## కరాటేలో విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బహుమతులు

ముద్ర, రామన్నపేట :



మండలంలోని ఎన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో పతకాలు సాధించారు. జిల్లా కేంద్రంలో జరిగిన కరాటే పోటీలలో విద్యార్థులు సల్ల వరూ దిని (7వ తరగతి) ప్రథమ బహుమతి, శ్రీరాముల చందు (8వ తరగతి) ద్వితీయ బహుమతి, మోక్షిత్, మణి తేజ, అమృత (7వ తరగతి) రమాదేవి, శరణ్య (9వ తరగతి) తృతీయ బహుమతులు, సర్టిఫికెట్స్ అందుకున్నారు. వారిని హెచ్ఎం కమలాదేవి అభినందించారు.

## ఘనంగా బీటీ రణదివె వర్ధంతి

ముద్ర ప్రతినిధి, భువనగిరి :



భారత కార్మిక వర్గ పోరాట యోధుడు, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్ బి.టి. రణదివె వర్ధంతిని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కల్లూరి మల్లేశం పాల్గొని బి.టి.ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, మాయ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు గంధమల్ల మాతయ్య, ప్రజా సంఘాల నాయకులు దయ్యాల నరసింహ, వనం రాజు, చింతల శివ, బందెల ఎల్లయ్య , సుందర్ ,కవిత, దనమ్మ, శ్రీను పాల్గొన్నారు.

## కేంద్రం తీసుకువచ్చిన రైతు చట్టాలను రద్దు చేయాలి

ముద్ర, యాదగిరిగుట్ట :




కేంద్ర ప్రభుత్వం రైతుల హక్కులను కాలరాసే విధంగా మూడు రైతు చట్టాలను తీసుకొచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరు రాజయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చొల్లేరు గ్రామంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కలేపల్లి మహేందర్, రైతు సంఘం నాయకులు పేరబోయిన బంగారు, నాయకులు మీసాల దాసు, ఈదులకంటి బక్కయ్య, ఉపేంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



ముద్ర ప్రతినిధి, భువనగిరి: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవంను సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు జెండా ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద శక్తివంతమైన రాజకీయ పార్టీ ఏభారతీయ జనతా పార్టీ అని అన్నారు. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి దేశ ప్రధానిగా ఎదగగల అవకాశాన్ని ఇచ్చిన పార్టీ బీజేపీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాయ దశరథ, మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, పోతంశెట్టి రవీందర్, చందుపట్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జైనపల్లి శ్యామ్ సుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, గూడూరు నార్రోతం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు కొప్పుల యాదిరెడ్డి, చందా మహేందర్ గుప్తా, సుర్వి శ్రీనివాస్ గౌడ్, దుర్గాప్రతి లక్ష్మీ నారాయణ, జిల్లా కార్యదర్శులు మేడి కోటేష్, వైజయంతి, తడిసిన మల్లారెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి మంగు నర్సింహా రావు, పంచద్దుల బలరాం, ఎంజాల నరసింహా రావు, మాజీ కౌన్సిలర్ బోర్ర రాకేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాల్లబండి కృష్ణచారి, కొల్లోజు సతీష్, రత్నపురం శ్రీశైలం, ఎంగిలి లక్ష్మణ్, ఎండి మహమ్మద్, కొల్లి చెల్లిమ్మ మల్లికార్జున్, కానుకుంట్ల రమేష్, రాము, వాస సాయి చరణ్ పాల్గొన్నారు.

### తుంగుర్తిలో..



ముద్ర, తుంగతుర్తి: సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని సంకినేని నివాసంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు నారాయణదాసు నాగరాజు జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సంకినేని రవీందర్రావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఉప్పుల లింగయ్య, మాజీ సర్పంచులు అంబటి రమేష్, గడ్డం ఉప్పలయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు ఎలగందుల రామచంద్రు, పెండం యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శి సంకృనాయక్, వెంకన్న,బండి నవీన్, సందీప్, శ్రీశైలం, సాయి కృష్ణ, రఫిక్, రవి, గణేష్, శ్యామ్, గుంజ విజయ్, మహేష్, లింగన్న, నరేందర్, వెంకన్న, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

### మోత్కూర్ లో..

ముద్ర, మోత్కూర్: బీజేపీ మోత్కూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బీజేపీ జెండాను పట్టణ అధ్యక్షురాలు చాడా మంజుల రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ 1980 ఏప్రిల్ 6న అటల్ బీహార్ వాజ్ పాయ్ అధ్యక్షతన ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతంగా, అంత్యోదయ స్ఫూర్తిగా, దేశమే ప్రథమము అనే లక్ష్యంతో స్థాపించబడిందని, ఇద్దరు ఎంపీలతో ప్రారంభమై నేడు దేశంలోని సుమారు 22 రాష్ట్రాలలో అధికారంలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పోచం సోమయ్య, పట్టణ నాయకులు సజ్జన మనోహర్, పట్టణ ప్రధాన కార్యదర్శి అన్యపు సత్యనారాయణ, ఎడ్లరాము, రాధారపు మల్లేశం, గుంటి సతీష్, గొడుగు చంద్రమౌళి, మధు సోమేశ్వరి, వారాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
07.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పచ్చిమిర్చి టిష్యూ పేపర్ ఉపయోగించాలి**

స్టోరేజ్ బాక్స్‌లో టిష్యూ పెట్టాలి. ఇది అదనపు తేమను పీల్చి మిర్చిని ఫ్రెష్‌గా ఉంచుతుంది.





# మెదక్ బంద్ ప్రశాంతం

- హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ పట్టణ బంద్ ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని గాంధీనగర్ హనుమాన్ దేవాలయంలో రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన నేపథ్యంలో సోమవారం బంద్‌కు హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు పూర్తిగా బంద్ పాటించాయి. విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, బీజేపీ నాయకులు, హిందువులు పెద్ద ఎత్తున గాంధీనగర్ హనుమాన్ దేవాలయానికి ఉదయమే చేరుకున్నారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీగా జూనియర్ కాలేజ్, కొత్త బస్టాండ్, హెడ్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్, పోలీస్ స్టేషన్, రాందాస్ చౌరస్తా, మెయిన్ రోడ్డు, పాత బస్టాండ్, ఆటోనగర్, వెల్కమ్ బోర్డు, రేణుకా మాత దేవాలయం మీదుగా మంబోజిపల్లి వరకు పెద్ద ఎత్తున నిర్వహించారు. రాందాస్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన చేశారు. ఇటీవల కాలంలో మెదక్ ప్రాంతంలో హిందూ దేవాలయాలపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నిరసన ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేశ్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, మాజీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, యువ మోర్చా అధ్యక్షుడు సతీష్, బీజేపీ సర్పంచ్ బెండవీణ, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, బీజేపీ సీనియర్ నాయకులు పబ్బ లక్ష్మణ్ బాబా, సాయికుమార్, వడ్ల జనార్ధన్, వేణుగోపాల్, అల్లం మధు, మనోజ్ కుమార్, కృష్ణారెడ్డి, సన్నీ, రాహుల్, బబ్లు, ఆఫీస్ సెక్రటరీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేటలో..**

అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం పార్టీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమే ప్రథమం అనే బలమైన సంకల్పంతో పనిచేసే కార్యకర్తలు కలిగిన పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు అందించాలనే లక్ష్యంతో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలతో అల్లాడుతున్నప్పటికీ మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పదాధికారులు, నాయకులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# కార్మిక ఉద్యమాల వేగుచుక్క కామ్రేడ్ బి.టి. రణదీవే

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**




భారత కార్మిక ఉద్యమ నిర్మాత, కార్మిక వర్గ ఉద్యమ వేగుచుక్క బి.టి. రణదీవే అని, ఆయన స్ఫూర్తితో సమరశీల పోరాటాలు నిర్మిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. సోమవారం బాలచంద్ర త్రయంబక రణదీవే 36వ వర్ధంతి కార్యక్రమాన్ని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ భారత కార్మిక ఉద్యమ నిర్మాతల్లో ఒకరు బి.టి. రణదీవే 1904 డిసెంబర్ 19న మహారాష్ట్రలోని బొంబాయిలో జన్మించి, 1990 ఏప్రిల్ 6న మరణించారన్నారు. మొట్టమొదటిగా భారతదేశంలో ట్రేడ్ యూనియన్‌ను ఏర్పాటు చేసి, 1970లో సీఐటీయూ మొదటి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. కార్మికుల ప్రయోజనాలు తప్ప సొంత జీవితంపై ఆసక్తి లేని నిస్వార్థ కార్మిక నాయకుడని పేర్కొన్నారు. కార్మికులతో పాటు రైతాంగం, వ్యవసాయ కార్మికులు, ఉపాధ్యాయులు, మధ్యతరగతి ప్రజలు దేశంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడిన మహోన్నత వ్యక్తి బి.టి. రణదీవే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడాల కనకయ్య, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి, ఎలక్ట్రిసిటీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ర్యాకం అశోక్, యూనియన్ నాయకులు కనకరాజు, విష్ణువర్ధన్, మున్సిపల్ యూనియన్ నాయకులు రాజయ్య, సత్యం, మహేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చింతల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై జింక మృతి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

చౌటకూర్ మండలం, సుల్తాన్పూర్, శివారులో గల సంగారెడ్డి నాందేడ్ అకోలా 161 జాతీయ రహదారిపై జింక మృతి చెందింది. సుల్తాన్పూర్ గ్రామ సమీపంలోని డిఎస్ దాబా ఎదురుగా పెద్ద చెరువు వైపు నుండి రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఉంటుందని అటవీశాఖ సిబ్బంది భావిస్తున్నారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతం లో జింకలు, దుప్పిలు గణనీయ సంఖ్యలో సంచరిస్తున్నాయి. మేత కోసం చెరువు వైపు నుండి కోర్పోలు వైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టినట్లుగా తెలుస్తుంది. ప్రమాద దాటికి జింక ఎగిరి జాతీయ రహదారి మధ్య పూల మొక్కల్లో పడింది. ఈ సంఘటన రెండు రోజుల క్రితం జరిగి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. జింక మృతి చెందిన విషయాన్ని సంగారెడ్డి అటవిశాఖ సిబ్బందికి సమాచారం అందించగా,జింక కళేబరాన్ని పరిశీలించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ విశాల్ జింకకు పోస్టుమార్టం నిర్వహించి జాతీయ రహదారి పక్కనే పాతిపెట్టారు.

# ప్రజావాణి అర్జీలకు వెంటనే స్పందించాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారుడికి తెలియజేస్తూ లిఖితపూర్వక వివరణ అందజేయాలన్నారు. అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డీఓ శ్రీనివాస్ రావులతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.

**- 99 రోజుల కార్యక్రమాలను అమలు చేయాలి**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలను జిల్లా అధికారులు పక్కాగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి, క్షేత్రస్థాయి నివేదికలను త్వరితగతిన అందించాలని సూచించారు. అర్హులైన ప్రతి వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు.

**మెదక్‌లో ఈట్ రైట్ వాక్..**

పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుని, శరీరానికి వ్యాయామాన్ని అందిస్తే ఆరోగ్యకరమైన సమాజాన్ని తయారు చేయవచ్చని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో సోమవారం ఉదయం పండుగ వాతావరణంలో ఈట్ రైట్ వాక్ నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రతపై ప్రత్యేక దినోత్సవం సందర్భంగా హెడ్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి రాందాస్ చౌరస్తా వరకు వాకింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, ఎడ్యుకేషన్, ఫారెస్ట్, పోలీస్, స్పోర్ట్స్, ఇరిగేషన్, మత్స్యశాఖ, ఇండస్ట్రీస్, జిల్లా పరిషత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సరైన ఆహారం ఆరోగ్య భవిష్యత్తు అనే ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, 8న రక్షిత మాతృత్వ దినోత్సవం, 9న ఎయిడ్స్ నియంత్రణపై రెడ్ రన్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ డాక్టర్ శివ దయాల్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, అధికారులు జోజి, విజయ, హేమ భార్గవి, శ్రీనివాసరావు, ప్రకాష్ రావు, రమేష్, మల్లేశం, మున్సిపాలిటీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**సింగూర్ నీరు విడుదల చేయాలి**

సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆయకట్టకు వెంటనే సాగు నీటిని విడుదల చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కౌన్సిలర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సింగూర్ ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆయకట్టకు అత్యవసరంగా 0.3 టీఎంసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఘనపూర్ ఆయకట్టు కింద పంటలు ప్రస్తుతం కీలకమైన పొట్ట దశలో ఉండగా నీటి కొరత కారణంగా ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆనకట్టకు వెంటనే 0.3 టీఎంసీ నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లోగా చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, కోకన్వీనర్లు గడ్డమీద కృష్ణ గౌడ్, లింగారెడ్డి, మెదక్, హవేళి ఘనాపూర్ మండల పార్టీ అధ్యక్షులు యం. ఆంజాగౌడ్, సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్, జుబెర్ అహ్మద్, గౌస్, మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం, ఆర్కే శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు, మెదక్, పాపన్నపేట్, హవేళి ఘనాపూర్ మండల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ప్రావీణ్య

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**




వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఈసారి సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ముందుగానే చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ హీట్ వేవ్ ఉష్ణోగ్రతల నివేదికను జిల్లా అధికారుల గ్రూపులో షేర్ చేయాలని సీపీఓను ఆదేశించారు. కార్మికులు, సాధారణ ప్రజలు ఎండల వల్ల ఇబ్బందులు పడకుండా లేబర్ అడ్డాలు, పని ప్రదేశాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలోని అన్ని బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సమృద్ధిగా నిల్వ ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, గురుకులాలు, వసతి గృహాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని సబ్ సెంటర్ల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పని ప్రదేశాలు, బస్టాండ్లు, పరిశ్రమల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

**ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 67 అర్జీలు అందినట్లు తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేయాలి**

సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "హెల్త్ వీక్" కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేసి, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపుకు కృషి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆరోగ్య సేవల బలోపేతం, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపు లక్ష్యంగా ఈనెల 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న "హెల్త్ వీక్" కార్యక్రమాలపై కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ పాండు, డిఎంఅండ్ హెచ్ ఓ వసంత్ రావు, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ ఓ., జిజిహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ కవిత, ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ నాగనిర్మల, డాక్టర్ శశాంక్, డీడబ్ల్యుఓ లలిత కుమారి, డ్రగ్స్ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ, జైలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఆహార భద్రతపై అవగాహన పెంపొందించాలి**

ఆహార భద్రతలో భాగంగా ప్రజలు ఆహార పదార్థాల కొనుగోలు సమయంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించి కొనుగోలు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ సముదాయంలో జిల్లా ఆహార పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో అవగాహన సదస్సులు, లైసెన్సు మేళా, ఆహార స్టాళ్లను నిర్వహించారు. ఈసందర్భంగా ఆహారంలో కల్తీలపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. "పండ్లను కృత్రిమంగా పక్వం చేయుటకు సరైన మార్గం" అనే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ సభాభవనంలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి, వారికి ధృవపత్రాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఎక్కడైనా కల్తీ ఆహార పదార్థాలు ఉన్నట్లయితే తక్షణమే ఆహార భద్రత అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.. ప్రజలు ఆహార సంబంధిత ఫిర్యాదుల కోసం 9908978790 / 9985600602 నంబర్లను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, ఆహార భద్రత అధికారులు అమృత, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# 10 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లా వ్యాప్తంగా 518 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈనెల 10 నుంచి ప్రారంభించాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్లో సివిల్ సప్లై అధికారులు, ట్రాన్స్ పోర్ట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు, రైస్ మిల్లర్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, ధాన్యం కొనుగోలు సామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గన్ని బ్యాగులు, తూకం, టార్పాలిన్ కవర్లు, మొదలగు సామాగ్రి అందుబాటులో ఉండాలన్నారు. తూనికల కొలతల అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, రైస్ మిల్లుల్లో ధాన్యం తూకం కొలతలను తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ఫీల్డ్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా కోపరేటివ్ అధికారి కరుణాకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, రైస్ మిల్లు యాజమానులు పాల్గొన్నారు.

# అక్రెడిటేషన్ కార్డుల దరఖాస్తులకు గడువు ఇంకా ఉంది

- టీయూడబ్ల్యూజే జిల్లా నేతల సూచన

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

అక్రెడిటేషన్ కార్డుల దరఖాస్తులకు సంబంధించి సోమవారం వరకే గడువు అన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, రాష్ట్ర సామాజిక మాధ్యమ ప్రచార కమిటీ సభ్యుడు యాదగిరి తెలిపారు. ఇంకా జిల్లా స్థాయిలో అక్రెడిటేషన్ కమిటీలు ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు కావడానికి కొంత సమయం పడుతుందని, అనంతరం సమావేశం నిర్వహించడానికి మరో రెండు మూడు రోజులు పడుతుందని వివరించారు. రాష్ట్ర స్థాయిలో కూడా కమిటీ సమావేశం జరిగి కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు కార్డులు అందేలా కొన్ని మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకునే గడువు ఇంకా ఉన్నదని స్పష్టం చేశారు. జర్నలిస్టు మిత్రులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని సూచించారు. అందరూ ఒకేసారి దరఖాస్తు చేస్తున్నందున సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. తొందరపాటుతో దరఖాస్తుల్లో తప్పులు జరిగే అవకాశం ఉందని, అలాంటి తప్పుల వల్ల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గడువు ఇంకా ఉన్నందున ఆందోళన చెందకుండా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రెండేళ్ళ తర్వాత కొత్త కార్డులు జారీ అవుతున్నందున అర్హులందరికీ అక్రెడిటేషన్ కార్డులు అందాలని యూనియన్ నేతలు ఆకాంక్షించారు.

# విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం

- అంబేద్కర్ జయంతి నాడు ప్రతిభా పురస్కారాలు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

షెడ్యూల్డ్ కులాలలోని విద్యార్థిని, విద్యార్థులను ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా షెడ్యూల్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ పని చేస్తుందని సొసైటీ అధ్యక్షుడు మహంకాళి అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సొసైటీ సభ్యుడు పొన్నమల్ల రాములతో కలిసి మాట్లాడారు. షెడ్యూల్ క్యాస్ట్ విద్యార్థిని, విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ ఆపై తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సొసైటీ ఆధ్వర్యంలో ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి రోజున ఈ పురస్కారాలు అందిస్తామని, ప్రతి విద్యార్థికి నగదు, ప్రశంసా పత్రం, భారత రాజ్యాంగ పుస్తకం ఇవ్వడంతోపాటు వారి కళ్యాణకర్తలకు సన్మానం చేస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అన్ని వర్గాల షెడ్యూల్ క్యాస్ట్ విద్యార్థులు 10వ తేదీలోపు సొసైటీ సభ్యులను సంప్రదించాలని లేదా 9440494886, 9553681116, 9948653448 నంబర్లకు వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు పంపాలన్నారు. మంత్రి హరీష్ రావు సహకారంతో సొసైటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. సమావేశంలో సొసైటీ సభ్యులు నారాయణ, రామస్వామి, చంద్రమోహన్, కనక మల్లయ్య, భిక్షపతి, సత్యనారాయణ, లక్ష్మన్, సురేందర్, సాయి ప్రేమ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
07.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పచ్చిమిర్చి: ఎయిర్‌టైట్ కంటైనర్ వాడాలి**
గాలి లోపలికి రాకుండా బిగిగా మూసే డబ్బాలో పెట్టాలి. ఇది బ్యాక్టీరియా పెరగకుండా కాపాడుతుంది.





## ట్రంప్ డెడ్‌లైన్‌ల డ్రామా..

- ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టిందా?

**ముద్ర డెస్క్ :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన ప్రత్యేక శైలిలో అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారారు. ముఖ్యంగా ఇరాన్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన తరచూ హెచ్చరికలు జారీ చేసి, వెంటనే డెడ్‌లైన్‌లను పొడిగించడం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని, గందరగోళాన్ని కలిగిస్తోంది. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి ఈ వివాదానికి కేంద్రంగా మారింది. కఠిన చర్యల హెచ్చరికలు ఇచ్చిన ట్రంప్, అదే సమయంలో గడువులను మార్చడం ద్వారా తన వ్యూహం ఏంటన్నది స్పష్టంగా తెలియనివ్వడం లేదు. ఇది ఒకవైపు ఇరాన్‌పై మానసిక ఒత్తిడి పెంచే ప్రయత్నమైతే, మరోవైపు అమెరికా విశ్వసనీయతపై సందేహాలు రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితి గ్లోబల్ ఆయిల్ మార్కెట్లపై కూడా ప్రభావం చూపుతోంది. ట్రంప్ ప్రకటనలతో ధరల్లో అస్థిరత పెరుగుతుండగా, సోషల్ మీడియాలో ఆయన డెడ్‌లైన్‌లపై వ్యంగ్యాలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తానికి ట్రంప్ విధానం యుద్ధానికి దారి తీస్తుందా, లేక చర్చలకు మార్గం సుగమం చేస్తుందా అన్నది స్పష్టత లేని ప్రశ్నగానే మిగిలింది. ప్రపంచం మాత్రం ఈ ఉద్రిక్తతలు శాంతియుతంగా పరిష్కారమవుతాయని ఆశిస్తోంది.

# మద్యం ధరలు పెంపు..?

- త్వరలోనే నిర్ణయం
- జ్యుడీషియల్ కమిటీకి నివేదిక
- వచ్చేనెల నుంచి ధరలు పెరిగే అవకాశం..?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో జరుగుతున్న భీకర యుద్ధం కారణంగా మందుబాబుల జేబులకు చిల్లు పడనుంది. గ్యాస్ కొరత, సీసాల ఉత్పత్తి తగ్గిపోవడం, ధరల సమీక్ష గడువు ముగియడం వంటి కారణాలతో ఉత్పత్తి ఖర్చులు పెరిగాయని కంపెనీలు చెబుతున్నాయి. ఇప్పటికే మద్యం ధరలు పెంచాలని డిస్టిలరీ యాజమాన్యాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో మద్యం ధరల పెంపు ఉండనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య చెలరేగిన యుద్ధం పశ్చిమాసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. గ్యాస్, ముడి చమురు రవాణాతో పాటు సరఫరా వ్యవస్థకు అడ్డంకులు ఏర్పడటంతో ప్రపంచ దేశాల్లో ధరలు పెరుగుతున్నాయి. ఈ కారణంగానే మన దేశంలో ఇప్పటికే గ్యాస్ ధరలు పెరిగాయి. ఇప్పుడు యుద్ధ ప్రభావం మద్యం ప్రియులకు కూడా చేదు వార్తను తెచ్చిపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో మందుబాబులకు షాకిచ్చేలా మద్యం ధరలు పెరిగే సూచనలు ఉన్నాయి. బీర్లతో పాటు మద్యం ధరలు కూడా వచ్చే నెలలో పెరగనున్నాయి.

**- ధరల పెంపు తప్పదా..?**

పశ్చిమాసియా యుద్ధానికి తోడు రాష్ట్రంలో మద్యం ధరల పెంపు గడువు ఇప్పటికే పూర్తికావడంతో మద్యం ధరల పెంపు తప్పదనే సూచనలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతి రెండు ఏళ్లకు ఒకసారి రాష్ట్రంలో మద్యం ధరలను సమీక్షిస్తారు. చివరిసారిగా 2023 మే నెలలో తెలంగాణలో మద్యం ధరలను పెంచారు. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మళ్లీ 2025 మే నెలలో ధరలను సమీక్షించాల్సి ఉన్నా, ఆ గడువు ఎప్పుడో ముగిసిపోయింది. మరోవైపు యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా నేచురల్ గ్యాస్ సరఫరా వ్యవస్థ దెబ్బతింది. దీంతో మద్యం సీసాల తయారీ ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. అదే సమయంలో వాటి సరఫరా వ్యవస్థలో కూడా అంతరాయాలు ఏర్పడ్డాయి.

**12 నుంచి 15 శాతం**

ఈ నేపథ్యంలోనే నేచురల్ గ్యాస్ కొరత కారణంగా గాజు సీసా తయారీ యూనిట్లు తమ ఉత్పత్తిని కాస్త తగ్గించుకోగా, కొన్ని యూనిట్లు పూర్తిగా మూసివేశారు. దీంతో దేశంలోని ప్రధాన గాజు తయారీ కేంద్రాల్లో ఉత్పత్తి ఏకంగా 40 శాతం పడిపోయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఖాళీ సీసాల ధరలు ఏకంగా 20 శాతం వరకు పెరిగాయి. పెరిగిన అదనపు భారాన్ని తాము భరించలేకపోతున్నామని వెంటనే రాష్ట్రంలో మద్యం ధరలను పెంచాలని డిస్టిలరీ యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మరోవైపు మద్యం తయారీదారులు ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులను కలిసి మద్యం ధరలను 12 శాతం నుంచి 15 శాతం వరకు పెంచాలని వినతిపత్రం కూడా అందించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ధరల పెంపునకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మద్యం ధరల పెంపుపై ఇప్పటికే కసరత్తు చేపట్టిన ప్రభుత్వం రిటైర్డ్ జడ్జితో కూడిన జ్యుడీషియల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ జ్యుడీషియల్ కమిటీ మద్యం ధరల పెంపు అంశాన్ని పరిశీలిస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులతో పాటు మద్యం తయారీ సంస్థల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో రాష్ట్రంలో మద్యం ధరల పెంపు తప్పదనే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే మద్యం ధరల పెంపును ఐదు స్లాబులుగా విభజించి అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. బాటిల్ సైజ్ (90 ఎంఎల్, క్వార్టర్, హాఫ్, ఫుల్ బాటిల్), బ్రాండ్ (తక్కువ ధర మద్యం, మధ్యతరహా, ప్రీమియం బ్రాండ్లు), పన్ను స్లాబ్ నిర్మాణం ఆధారంగా ధరలను పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం మే నెలలో కొత్త ధరలను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.



**- బీర్లపై కీలకం**

మరీ ముఖ్యంగా బీర్ల విషయానికి వస్తే గతేడాది ఫిబ్రవరిలోనే రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను 15 శాతం పెంచింది. ప్రస్తుతం సీసాల కొరత, అల్యూమినియం క్యాన్ల ధరలు కూడా పెరగడంతో మళ్లీ బీర్ల ధరలను పెంచాలని కంపెనీలు విజ్ఞప్తి చేస్తున్నాయి. అదే సమయంలో వేసవిలో బీర్లకు 30 శాతం వరకు అధిక డిమాండ్ ఉండటంతో సరఫరా 20 శాతం తగ్గి మార్కెట్‌లో బీర్ల కొరతకు దారితీసే అవకాశం ఉంది. ప్రస్తుతం కొరత కనిపించకపోయినా బీర్ల సరఫరా మందగిస్తున్నట్లు తెలుస్తోంది. ఏటా రూ.40 వేల కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చే మద్యం రంగంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం అధికారులను ఆందోళనకు గురి చేస్తోంది.



## ఈట్ రైట్ మేళాలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

- ఆరోగ్యకర ఆహారంపై అవగాహన అవసరం
- కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తప్పవు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

నేచర్ క్యూర్ ఆసుపత్రిలో నిర్వహించిన "ఈట్ రైట్ - స్టే హెల్తీ" మేళాలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, చిరుధాన్యాలతో తయారైన ఆహార పదార్థాలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యకర ఆహారంపై అవగాహన పెంపొందించడం అత్యవసరమని తెలిపారు. ఆహారం ఎంత తినాలో మాత్రమే కాకుండా, నాణ్యత కూడా ముఖ్యమని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, మానసిక ప్రశాంతత ఆరోగ్యానికి అవసరమన్నారు. రాష్ట్రంలో ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, గత రెండేళ్లలో వేలాది తనిఖీలు నిర్వహించామని వెల్లడించారు. కల్తీ ఆహారం విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మేళా సందర్భంగా వీధి ఆహార విక్రేతలకు నమోదు ధృవపత్రాలు, పరిశుభ్రత పాటిస్తున్న హోటళ్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

## తెలంగాణ రైజింగ్ 2045 లక్ష్యాలకు వ్యవసాయం కీలకం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**




ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ఇక్రిశాట్ సంయుక్త ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గానికి చెందిన యువ రైతులకు సాయిల్ హెల్త్ వాలంటీర్లుగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లాలోని పటాన్‌చెరు ఇక్రిశాట్ వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన ప్రతి గ్రామం నుంచి ఒక్కొక్క రైతును ఎంపిక చేసి సాయిల్ హెల్త్ వాలంటీర్‌గా శిక్షణ అందించడం జరుగుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ శిక్షణలో భూసార పరీక్షలు, పంటల ఎంపిక, పంటల సరళి మార్పులు, వాతావరణ పరిస్థితుల ప్రభావం, అంతర్ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై నిపుణులు వివరంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైజింగ్ తెలంగాణ 2045 లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం, వ్యవసాయ సాంకేతిక వినియోగాన్ని ప్రోత్సహించడం, లాభసాటి పంటలు, పంటల విలువ వృద్ధి ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల ప్రధాన ఆస్తి భూమి అని, భూమి ఆరోగ్యంగా ఉంటేనే పంటల దిగుబడులు పెరిగి రైతుల ఆదాయం మెరుగుపడుతుందన్నారు. భూమి ఆరోగ్య పరిరక్షణపై రైతుల్లో అవగాహన పెంచడంలో సాయిల్ హెల్త్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ముఖ్య శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జానయ్య, కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి, ఉద్యాన శాఖ సంచాలకురాలు షేక్ యాస్మిన్ భాషా, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, ఉప డైరెక్టర్ జనరల్ స్టాన్ఫోర్డ్ బ్లాడే, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



## మా పార్టీలో బంజారాలకు సముచిత స్థానం

- బంజారా ప్రముఖులతో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భేటీ
- కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై సమాలోచనలు
- బంజారా సమాజం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆరా

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఈ నెల 25న తాము స్థాపించబోయే కొత్త పార్టీలో బంజారా సమాజానికి సముచిత గౌరవం, రాజకీయ అవకాశాలు కల్పిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. కొత్త పార్టీ విధివిధానాల రూపకల్పనలో బంజారా మేధావులు, ప్రముఖులు తమ అమూల్యమైన సలహాలు అందించాలని కోరారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించే బంజారా యువతకు, నాయకులకు తమ పార్టీ సాదర స్వాగతం పలుకుతుందన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్‌తో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి, డీటీ నాయక్‌తో పాటు పలువురు బంజారా సామాజిక వర్గ ప్రముఖులతో భేటీ అయ్యారు. ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో, బంజారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, వారి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కూడా ఎప్పుడూ మంత్రివర్గంలో బంజారాలకు ప్రాతినిధ్యం లేకుండా లేదన్నారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించలేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో బంజారా ప్రముఖులు, ట్రైబల్ వెల్ఫేర్ మాజీ కమిషనర్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి లక్ష్మణ్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ భీమ్లా నాయక్, బస్కీ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి హరి నాయక్, ట్రైబల్ ఎలక్ట్రిసిటీ బోర్డు అధ్యక్షుడు నారాయణ, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ మీడియా కార్యదర్శి భీముడు నాయక్, ఎలక్ట్రిసిటీ డీఈఈ బాలాజీ నాయక్, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ నాయక్, జాగృతి నాయకులు మోహన్ నాయక్, కళ్యాణ్ నాయక్, సక్రు నాయక్, రవి రాథోడ్, శివ నాయక్, రాంజీ నాయక్, మహేందర్ నాయక్, మానుకోట కళ్యాణ్ నాయక్ పాల్గొన్నారు.

## విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోండి

- కేరళలో మీ ప్రస్థానం 70 ఏళ్ళు
- తెలంగాణలో మా పాలన 28 నెలలే
- మీరు ఉటంకించిన గణాంకాలన్నీ బీఆర్ఎస్ పాలనలోనివి
- కేరళ సీఎం పినరయి విజయన్‌కు రేవంత్ రెడ్డి లేఖ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

70 ఏళ్ల కేరళ ప్రస్థానాన్ని తెలంగాణలో 28 నెలల కాంగ్రెస్ పాలనతో పోల్చడం తగదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో తాము అధికారంలో వచ్చి కేవలం 28 నెలలే అయిందన్న ఆయన కేరళలో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధికారంలో వచ్చి 120 నెలలు అయిందనే విషయాన్ని గుర్తుకు గమనించాలని సూచించారు. తనపై కేరళ సీఎం పినరయి విజయన్ చేసిన ట్వీట్లకు కౌంటర్‌గా రేవంత్ రెడ్డి సోమవారం ఆరు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. కేరళ అభివృద్ధి మోడల్‌లోని లోపాలను ఎత్తిచూపుతూనే, తెలంగాణలో గత 28 నెలల్లో సాధించిన ప్రగతిని ఆ లేఖలో వివరించారు. పినరయి విజయన్ ఉటంకించిన గణాంకాలన్నీ 202324 నాటివని, అవి తెలంగాణలో గత ప్రభుత్వ పాలన చివరి దశకు సంబంధించినవని పేర్కొన్నారు. తెలంగాణ జీఎస్‌డీపీ 10.1శాతం వృద్ధి రేటుతో జాతీయ సగటు (9.9శాతం) కంటే ఎక్కువగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దక్షిణాదిలోనే అత్యధిక తలసరి ఆదాయం (రూ.3.79 లక్షలు) కలిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. రైతు భరోసా, రూ.2 లక్షల వరకు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. కేరళలో యువత ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారని, అక్కడ పారిశ్రామికాభివృద్ధి కుంటుపడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలో కేవలం 28 నెలల్లోనే 67,763 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హబ్‌గా మార్చామని తెలిపారు.

**అవినీతి ఆరోపణలు, బీజేపీతో సంబంధం..**

కేరళలో జరిగిన 'గోల్డ్ స్మగ్లింగ్' కేసును, శబరిమల ఆలయ బంగారం తాపడం విషయంలో జరిగిన అక్రమాలను రేవంత్ రెడ్డి తాను రాసిన లేఖలో ప్రస్తావించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గాంధీ కుటుంబాన్ని వేధిస్తోందని ఆరోపించారు. కానీ కేరళ సీఎం కార్యాలయంపై వస్తున్న ఆరోపణల విషయంలో సీబీఐ ఎందుకు మౌనంగా ఉందో ప్రజలకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన 'నరసింహం' సినిమాలోని ప్రసిద్ధ డైలాగ్ "నీ పో మోనే విజయన్" (నువ్వు వెళ్లు బాబు విజయన్) అని ఉటంకిస్తూ కేరళ సీఎంకు సెటైర్ వేశారు. ఏప్రిల్ 7న తిరువనంతపురం వచ్చి నేరుగా గణాంకాలతో చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆహ్వానించారు. తెలంగాణ అభివృద్ధిని విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని రేవంత్ రెడ్డి ఈ లేఖ ద్వారా హితవు పలికారు.

# హెల్త్ ఏటీఎంలు

- వైద్య విధానంలో కీలక మార్పు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు
- 2 నిమిషాల్లో టెస్టుల ఫలితాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

వైద్య విధానంలో కీలక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో హెల్త్ ఏటీఎంలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. కేవలం 2 నిమిషాల్లోనే ఏకంగా 132 రకాల వైద్య పరీక్షలను చేయనున్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న ఈ హెల్త్ ఏటీఎంలు విజయవంతం కావడంతో మరిన్ని ఆస్పత్రులకు విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఓపీ రోగులు ఎక్కువగా వచ్చే ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే సాంకేతికతతో కూడిన హెల్త్ ఏటీఎంలను రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రెండు ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురాగా, ఇవి విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్**

ఔట్ పేషెంట్లు అధికంగా ఉండే ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. హెల్త్ ఏటీఎంలుగా పిలుస్తున్న ఈ ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్టింగ్ యంత్రాలను త్వరలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి, మలక్‌పేట ఏరియా ఆస్పత్రుల్లో హెల్త్ ఏటీఎంలను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసి పరీక్షించారు. ఇవి పూర్తిగా విజయవంతం కావడంతో మరిన్ని ఆస్పత్రులకు విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. రోగనిర్ధారణలో ఈ హెల్త్ ఏటీఎంలు కచ్చితత్వాన్ని చూపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ హెల్త్ ఏటీఎంలలో టెస్టులు చేయించుకున్న రోగుల నమూనాలను టీ డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపించారు. అలాగే ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో కూడా మెడికల్ టెస్టులు నిర్వహించారు. హెల్త్ ఏటీఎంలలో వచ్చిన ఫలితాలు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలోనూ రావడంతో ఈ హెల్త్ ఏటీఎంల పనితీరు సంతృప్తికరంగా ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలోని మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన ఒక నివేదికను అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు.

**ఇక్కడే ప్రధానం**

పేషెంట్ల రద్దీ అధికంగా ఉండే ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు వేగంగా ఆరోగ్య సేవలు అందించవచ్చని చెబుతున్నారు. నిమిషాల వ్యవధిలోనే ఈ హెల్త్ ఏటీఎంలు 132 రకాల మెడికల్ టెస్టులను స్వయంచాలకంగా నిర్వహిస్తాయని అధికారులు పేర్కొన్నారు. డాక్టర్‌తో ప్రత్యక్ష సంబంధం లేకుండానే అన్ని ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను పూర్తి చేయనున్నాయి. అత్యాధునిక సమగ్ర వైద్య పరికరాలతో పనిచేసే ఈ హెల్త్ ఏటీఎంలు రోగుల శరీరాన్ని స్కాన్ చేసి, బీపీ, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు, బరువు, ఎత్తు, శరీర ఉష్ణోగ్రత వంటి అంశాలను వేగంగా కొలుస్తాయి. మరోవైపు మలేరియా, డెంగ్యూ, యూరిన్, కొలెస్ట్రాల్, ఈసీజీ, షుగర్, హెచ్‌డీ వంటి ర్యాపిడ్ టెస్టులను వేగంగా నిర్వహిస్తాయి. ఇక రోగుల డిజిటల్ హెల్త్ రికార్డ్‌ను కూడా తయారు చేసి భద్రపరుస్తాయి. మెడికల్ టెస్టులు పూర్తైన తర్వాత ఇదే యంత్రం ద్వారా డాక్టర్‌తో మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. ఒక ప్రైవేట్ సంస్థ ఈ హెల్త్ ఏటీఎం యంత్రాలను అభివృద్ధి చేయగా, రెండు నెలల పాటు పరీక్షించారు. ఈ హెల్త్ ఏటీఎంల వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల కోసం వేచి చూసే అవసరం తగ్గి, రోగులకు వేగంగా సేవలు అందనున్నాయి.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
07.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



పచ్చిమిర్చి: ఫ్రిజ్‌లో సరైన ప్రదేశంలో ఉంచాలి
వెజిటబుల్ ట్రేలో ఉంచడం ఉత్తమం. చాలా చల్లగా ఉంచితే గడ్డకట్టే ప్రమాదం ఉంది.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు

- **ఈ నెలాఖరు పూర్తి చేస్తాం**
- **అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది**
- **సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూట్నీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేస్తామని తెలిపారు. అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ లో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేస్తామని తెలిపారు. జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె కోరారు.

## ప్రైవేట్ వ్యక్తులకు అడ్డదారిన రూ. 200 కోట్ల భూమి

- **కొహెడ ఫ్రూట్ మార్కెట్ భూమి ధారాదత్తానికి యత్నం**
- **ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణ**
- **అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ నిర్మించాలని బీఆర్ఎస్ నిర్ణయం**

**ముద్ర, రంగారెడ్డి :**

కొహెడలో ఫ్రూట్ మార్కెట్ కోసం కేటాయించిన సుమారు 200 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. సోమవారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కొహెడలో ఫ్రూట్ మార్కెట్ కు కేటాయించిన స్థలంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కొహెడ ఫ్రూట్ మార్కెట్ పరిరక్షణ, భూ బాధితుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఫ్రూట్ మార్కెట్ భూములను పరిశీలించారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి నిర్ణయం తీసుకుని నిధులు కూడా కేటాయించిందని ఆయన తెలిపారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సింది పోయి భూమిని ఇతరులకు ఇవ్వాలని చూస్తోందని విమర్శించారు. ఈ ప్రాజెక్ట్ వల్ల వేలాది మంది రైతులకు లాభం చేకూరుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.కోర్టు వివాదాలు ఉన్న భూముల్లో ప్రాజెక్ట్ మార్పులు చేస్తే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## నివృత్తి కేంద్రాల వల్ల సత్ఫలితాలు

- **చర్లపల్లి జైలులో కేంద్రాన్ని ప్రారంభించిన గవర్నర్**

**ముద్ర, కుషాయిగూడ:**

నివృత్తి కేంద్రాల వల్ల సత్ఫలితాలు వస్తాయని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆశాభావం వ్యక్తం చేశారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో 'నివృత్తి' వ్యసన విముక్తి కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి, అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం తీవ్రమైన ప్రజారోగ్య సమస్య అని, దీనిని శాస్త్రీయ పద్ధతిలో ఎదుర్కోవాలి అని అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో అనేకసార్లు జైలుకు వెళ్లిన అనుభవం ఉండటం వల్ల, ఖైదీలు ఎదుర్కొనే ఇబ్బందులు, సిబ్బంది పడే కష్టాలు తనకు తెలుసన్నారు. అందుకే గతంలో జైలు శాఖ మంత్రిగా ఖైదీలకు మానవీయ వాతావరణం కల్పించాలని, కారాగారాల్లో ఫ్యాన్లు, టీవీ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చానని తెలిపారు. పోలీసు కానిస్టేబుళ్లతో సమానంగా జైలు వార్డర్లకు వేతనాలు అందేలా కృషి చేశానని వివరించారు. కారాగారాల శాఖ సంచాలకులు డాక్టరు సౌమ్య మిశ్రా మాట్లాడుతూ ఈ కేంద్రాల పనితీరును వివరించారు. అనంతరం ఖైదీల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, ఖైదీలు సాగు చేస్తున్న సేంద్రియ పంటలు, తేనెటీగల పెంపకాన్ని తిలకించి వారితో గవర్నర్ ముచ్చటించారు కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు బి. శైలజ, ఉప్పల్ ప్రాంత ఉప పోలీసు కమిషనర్ కె. సురేష్ కుమార్, కారాగారాల శాఖ ఐజీ మురళీబాబు, డీఐజీ డాక్టరు డి.శ్రీనివాస్, సూపరింటెండెంట్లు నవాబ్ శివకుమార్ గౌడ్, ప్రమోద్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



## వరుసగా నాలుగోసారి నంబర్1గా మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ

**ముద్ర, ముంబై:**

భారతదేశంలో ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల తయారీలో మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ మరోసారి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోనూ కంపెనీ మార్కెట్లో నంబర్1 స్థానాన్ని నిలబెట్టుకుని వరుసగా నాలుగో ఏడాది ఈ ఘనత సాధించింది. డ్రైవర్లు, ఫ్లీట్ యజమానులు తమ వ్యాపార అభివృద్ధి కోసం ఎంఎల్ఎంఎంఎల్‌పై ఉంచిన విశ్వాసానికి ఈ విజయమే నిదర్శనమని కంపెనీ తెలిపింది. ఇప్పటివరకు సంస్థ మొత్తం 3.4 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించింది. ఎల్ 5 కేటగిరీలో 39.7 శాతం మార్కెట్ వాటాతో కంపెనీ బలమైన స్థానంలో ఉంది. 2026లోనే 1 లక్ష ఈవీల అమ్మకాలను దాటిన తొలి కమర్షియల్ వాహన తయారీ సంస్థగా చరిత్ర సృష్టించింది. సస్టైనబిలిటీ దిశగా కూడా సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. మొత్తం 6 బిలియన్ ఈ కిలోమీటర్ల ప్రయాణాలను పూర్తి చేసి సుమారు 240 కిలో మెట్రిక్ టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సహకరించింది. ఇక కొత్తగా ప్రవేశపెట్టిన మహీంద్రా ఉడో వాహనం కంపెనీ ఉత్పత్తుల శ్రేణిని మరింత విస్తరించింది. రివర్స్ థ్రోటిల్, ఏరోడైనమిక్ డిజైన్ నిజ జీవితంలో 200 కిలోమీటర్ల డ్రైవింగ్ రేంజ్ వంటి ప్రత్యేకతలతో ఈ వాహనం వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఆవిష్కరణలు, విశ్వసనీయత, సస్టైనబిలిటీపై దృష్టి కొనసాగించడం ద్వారా భారతదేశంలో లాస్ట్ మైల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో ముందంజలో ఉండాలని ఎంఎల్ఎంఎంఎల్ లక్ష్యంగా పెట్టుకుంది.

# గత పాలకులు అడ్రస్ లేకుండా చేశారు

- **అనంతపురంకు నీరు తరలించడం విజయం**
- **భూసంరక్షణ చర్యలతో జిల్లాలో 2.2 మీటర్ల మేర జలాలు పెరిగాయి**
- **2047 నాటికి అగ్రస్థానంలో ఏపీ**
- **యాడికి సభలో ఏపీ సీఎం చంద్రబాబు**

**ముద్ర, అనంతపురం:**



గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారని, ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అనంతపురం జిల్లా యాడికి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. గతంలో మూడు ముక్కలాట ఆడారని, ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు అమరావతికి మద్దతు పలికారని, ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని విమర్శించారు. భూసంరక్షణ చర్యల కారణంగా అనంతపురం జిల్లాలో 2.2 మీటర్ల మేర జలాలు పెరగటం సంతోషం కలిగిస్తోందన్నారు. అన్నమయ్య జిల్లాలో దీనిని ఓ ప్రజాఉద్యమంగా చేపట్టి విజయం సాధించారని, ఈ ఉద్యమంలో ప్రజలందరికీ తాను తోడుగా ఉంటానన్నారు. 5.7 టీఎంసీల నీరు అందుబాటులోకి వచ్చిందని, ఒక్క జిల్లాలో 96 కోట్ల మేర విద్యుత్ ఆదా అయ్యిందని, భూగర్భజలాలు పెరగటంవల్ల హరిత ప్రాంతం పెరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547, రబీకి 343 , పరిశ్రమలకు 28, తాగునీటికి 158, మొత్తంగా 1300 టీఎంసీల నీరు అవసరం ఉంటుందన్నారు. దేశంలోనే అతితక్కువ వర్షపాతం పడే అనంతపురం జిల్లా కూటమి ప్రభుత్వం చూపిన చొరవ కారణంగా ఎక్కువ పండ్ల తోటలతో సంపన్నమైన ప్రాంతంగా మారిందన్నారు. గత పాలకులు విద్యుత్ ఛార్జీలు పెంచారు. రూ.1.24 లక్షల కోట్ల మేర అప్పులు చేశారు. కూటమి వచ్చాక వారు పెంచిన రూ.4,600 కోట్ల భారాన్ని కూడా ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. అలాగే తొలిసారి విద్యుత్ ఛార్జీల ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు. . పిచ్చి ముదిరి, అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని అన్నారు. బాబాయిని చంపి నా చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారని దుయ్యబట్టారు. అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే, చూసి సహించలేక ఫ్రస్టేషన్ తో అవినీతి జరిగిందని అంటున్నారని అన్నారు. 2047 నాటికి ఏపీని అగ్రస్థానంలోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నామని, దీనికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశామన్నారు. ఉత్తరాంధ్ర నుంచి పశ్చిమ గోదావరి వరకూ విశాఖ, ప్రకాశం నెల్లూరు వరకూ అమరావతి, తిరుపతి కేంద్రంగా రాయలసీమ ప్రాంతాల్లో అభివృద్ధి రీజియన్లుగా తయారవుతాయని తెలిపారు. గత పాలకులు రాష్ట్రంపై పగపట్టారని అన్నారు. హంద్రీనీవా ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు తీసుకెళ్లామన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని అన్నారు. ప్రతీ జిల్లాను అభివృద్ధి చేస్తున్నామని, ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత ప్రభుత్వనిదేనని, దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ఎదురు దాడి చేస్తున్నారని అన్నారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదం నాణ్యతను దెబ్బతీశారని, కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరాలని ఒత్తిడి

- **పోలీసులను బ్రోకర్లుగా వాడుకుంటున్న ఎమ్మెల్యే**
- **మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



బీఆర్ఎస్ కార్పొరేటర్లను ప్రలోభ పెట్టి కాంగ్రెస్ లో చేర్చుకునేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పోలీసులను బ్రోకర్లుగా వాడుకుంటున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ కార్పొరేటర్ల కు పదవుల ఆశ చూపి ప్రలోభ పెడుతున్నారని, ఇప్పటికే కొందరికి ఫోన్లు చేశారని, వాళ్లు స్పందించకుంటే పోలీసుల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారని మండిపడ్డారు. తాము ఊ కొడితే, బీఆర్ఎస్ లో చేరేందుకు కాంగ్రెస్ కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే విద్యావంతుడని అనుకున్న కానీ ఇలాంటి చిల్లర రాజకీయం చేస్తారని అనుకోలేదన్నారు. ఎమ్మెల్యే కు అనుకూలంగా ఉంటే మైనింగ్, ఇసుక దందా లో రూ. లక్షలు గడించాలని పోలీసులు బ్రోకర్లుగా మారుతున్నారని, కొందరు పోలీసులు బీఆర్ఎస్ కార్పొరేటర్ల కు ఫోన్లు చేసి కాంగ్రెస్ లో చేరాలని, లేకుంటే కేసులు నమోదు చేసి జైల్లో పెడతామని బెదిరిస్తున్నారని, ఆ పోలీసుల వ్యవహారం బయటపెడతామని అన్నారు. ఎమ్మెల్యే కూడా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధినే ఆయన చూపించుకుంటున్నారని విమర్శించారు. కార్పొరేషన్ ఎన్నికలు పూర్తయి రెండు నెలలు కాకముందే తమ పార్టీ కార్పొరేటర్ల ను లాగే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, కార్పొరేటర్లు నవకాంత్, శరత్ రెడ్డి, రమేష్ నాయక్, కిషోర్ కుమార్, మధు మోహన్, సత్యం సీనియర్ నాయకులు కుర్వ శ్రీశైలం,శ్రీను నాయక్, సిద్దిక్, జహంగీర్, ఖలీం, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ కట్టడి అనివార్యం

- **ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి.**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




కల్తీ ఆహారాన్ని కట్టడి చేయడం అత్యంత అవసరమని ప్రతి ఒక్కరూ అహ్వాన కలిగి ఉండాలని రాష్ట్ర కుటుంబ ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం బల్కంపేట లోని నేచర్ క్యూర్ హాస్పిటల్ లో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "ఈట్ రైట్ మేళా"కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో బయట ఆహారంపై ఆధారపడటం పెరిగిన నేపథ్యంలో కల్తీ ఆహారం సమస్యను కట్టడి చేయడం అవసరమన్నారు. కల్తీ ఆహారం దీర్ఘకాలంలో కిడ్నీ, కేన్సర్, డయాబెటిస్ వంటి వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.40 లక్షల ఫుడ్ సంస్థలపై పర్యవేక్షణ కొనసాగుతోందన్న ఆయన ఇప్పటివరకు వేల సంఖ్యలో తనిఖీలు, నమూనాల సేకరణ చేపట్టినట్లు వివరించారు. ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ విస్తరణ, సిబ్బంది పెంపు, కఠిన చర్యల ద్వారా ఆహార భద్రతను బలోపేతం చేస్తామని తెలిపారు. "ఈట్ రైట్" ప్రచారం ద్వారా పాఠశాలలు, విద్యాసంస్థలు, సమాజంలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఆరోగ్య శాఖ క్రిస్టినా చోంగ్తు, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ ప్రియాంక అల, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డా. రవీంద్ర, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర, తెలంగాణ వైద్య విధాన పరిషత్ డైరెక్టర్ డా. అజయ్, ఆయుష్ డైరెక్టర్ డా. శ్రీకాంత్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ డా. శ్రీలీల, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటి పాల్గొన్నారు.

## మట్టి ఆరోగ్యాన్ని మెరుగుపరుద్దాం

- **మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**
- **ప్రతి రెవెన్యూ గ్రామంలో మట్టి పరీక్షలు**

**ముద్ర, రంగారెడ్డి :**

నేల ఆరోగ్యం పంటలకే కాకుండా పర్యావరణం, మానవ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉంటేనే పౌష్టికాహారం, పర్యావరణ సమతుల్యత, మానవ శ్రేయస్సు సాధ్యమవుతాయని చెప్పారు. పటాన్‌చెరులో ఇక్రిశాట్, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ గ్రామంలో మట్టి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 4 లక్షల మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయనున్నామని చెప్పారు. 30 వేల మంది సాయిల్ హెల్త్ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రైతులు అధిక రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులను అవలంబించాలని సూచించారు.పప్పుధాన్యాలు వంటి లెగ్యూమినస్ పంటల సాగు ద్వారా నేల సారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. శిక్షణలో భాగంగా మట్టి నమూనాల సేకరణ, ల్యాబ్ పరీక్షలు, సాయిల్ హెల్త్ కార్డు వినియోగం, కంపోస్టింగ్, పంట మార్పిడి వంటి అంశాలపై శాస్త్రవేత్తలు మార్గనిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. స్టాన్ఫోర్డ్ బ్లెయిడ్, అగ్రికల్చర్ సెక్రటరీ సురేంద్ర మోహన్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి డా. రాజి రెడ్డి పాల్గొన్నారు.



## సరిహద్దులో మొసళ్లు, పాములు?

- **బీఎస్ఎఫ్ కొత్త ఆలోచనపై చర్చ**
- **బంగ్లాదేశ్ సరిహద్దులో కొత్త వ్యూహం.. ప్రజల్లో ఆందోళన**

**ముద్ర, డెస్క్:**

బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో చొరబాట్లు, స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు బీఎస్ఎఫ్ వినూత్న వ్యూహాన్ని రచించింది. నదీ పరివాహక ప్రాంతాల్లో పాములు, మొసళ్లను వదిలి సహజ రక్షణ ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనపై ప్రాథమిక స్థాయిలో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ప్రణాళిక అమలు సాధ్యాసాధ్యాలపై, స్థానిక ప్రజలపై ప్రభావం, వరదల సమయంలో ఏర్పడే ప్రమాదాలు వంటి అంశాలను అధికారులు అధ్యయనం చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో తరచూ వరదలు రావడం, ఫెన్సింగ్ ఏర్పాటు కష్టంగా ఉండడం వల్ల ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రతిపాదన అమలైతే సరిహద్దు ఇరువైపులా నివసించే ప్రజలకు ముప్పు ఏర్పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆలోచన ప్రాథమిక దశలో ఉండగా, అన్ని కోణాల్లో పరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## చిన్నారి హత్య కేసు నిందితుడి రిమాండ్

**ముద్ర , నారాయణపేట:**

అభం శుభం తెలియని చిన్నారిపై మద్యం మత్తులో అత్యాచారయత్నం చేసి ఆపైగా హత్య చేసిన ఘటనను నారాయణపేట పోలీసులు ఛేదించారు. నారాయణపేట మండలం అమ్మిరెడ్డిపల్లి గ్రామంలో ఐదేళ్ల చిన్నారిని అదే గ్రామానికి చెందిన బక్క చిన్న నరసింహులు మార్చి 31న అత్యాచారయత్నం చేసి ఆపై హత్య చేసి గ్రామ సమీపంలోని చెరువు వద్ద వదిలి వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడు 2014 లో కూడా అత్యాచార యత్నం ఘటనలో రిమాండ్ కు వెళ్లినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు.





# ఐపీఎల్‌లో ఆసక్తికర పరిణామాలు..

## పాండ్య ఫిట్‌నెస్ నుంచి కోహ్లీ ఫామ్ వరకు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ క్రమంగా ఉత్సాహాన్ని పెంచుకుంటోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మూడు మ్యాచ్‌లు ఆడగా, మిగతా జట్లు రెండేసి మ్యాచ్‌లతో ముందుకు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జట్ల ప్రదర్శనతో పాటు కొన్ని కీలక అంశాలు చర్చనీయాంశంగా మారాయి. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌కు ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య అందుబాటులో ఉంటాడా అనే సందేహం నెలకొంది. దిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో సూర్య కుమార్ యాదవ్ జట్టును నడిపించగా, పాండ్యకు విశ్రాంతి ఇచ్చారు. అతడి గైర్హాజరీ ముంబయికి స్పష్టంగా ప్రభావం చూపించింది. పేస్ ఆల్‌రౌండర్ కొరత జట్టును ఇబ్బందులకు గురి చేసింది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ప్రశాంత్ వీర్ ఎంపిక కూడా చర్చకు దారి తీసింది. భారీ మొత్తం ఖర్చు చేసి జట్టులోకి తీసుకున్నప్పటికీ, అతడితో బౌలింగ్ చేయించకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఇదే తరహా పరిస్థితి కోల్‌కతా నైట్‌రైడర్స్‌లో కామెరూన్ గ్రీన్ విషయంలో కనిపిస్తోంది. దీంతో సీఎస్‌కేలో ప్రశాంత్ వీర్ పాత్రపై సోషల్ మీడియాలో పోలికలు మొదలయ్యాయి. ఇక లఖ్‌నవూ జట్టు విజయానికి రిషభ్ పంత్ కీలకంగా మారాడు. సన్‌రైజర్స్‌పై జరిగిన మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో చివరి వరకు నిలబడి జట్టుకు విజయం అందించాడు. మ్యాచ్ అనంతరం జట్టు యజమాని సంజీవ్ గోయెంకా అతడిని అభినందించడం ఆసక్తికరంగా మారింది. గత మ్యాచ్‌లో వీరిద్దరి మధ్య జరిగిన వాగ్వాదం తర్వాత ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు విరాట్ కోహ్లీ ఫామ్‌పై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ గ్లెన్ మెక్‌గ్రాత్ స్పందించాడు. వయసు పెరిగినా కోహ్లీ పరిమిత ఓవర్లలో ఇంకా ప్రభావవంతంగానే ఉన్నాడని పేర్కొన్నాడు. అలాగే ఈ సీజన్‌లో టాస్ తర్వాత బౌలింగ్ ఎంచుకునే జట్ల సంఖ్య పెరగడం ఆశ్చర్యం కలిగించిందని చెప్పాడు. ప్రస్తుత క్రికెట్‌లో భారీ స్కోర్లు కూడా సురక్షితంగా లేవని, ఛేజింగ్ జట్లు ధైర్యంగా ఆడుతున్నాయని విశ్లేషించాడు.



# ఐపీఎల్‌లో మెరుస్తున్న వెటరన్ బౌలర్లు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

క్రికెట్‌లో వయసు పెరిగేకొద్దీ బౌలర్ల ప్రదర్శన తగ్గుతుందని సాధారణంగా భావిస్తారు. కానీ ఐపీఎల్ 2026 సీజన్‌లో కొందరు వెటరన్ బౌలర్లు మాత్రం ఆ అభిప్రాయాన్ని పూర్తిగా తప్పు చేస్తున్నారు. జాతీయ జట్టుకు దూరమై ఏళ్లైనా, తమలోని పదును ఇంకా లేదని నిరూపిస్తున్నారు. ఈ సీజన్‌లో యువ బౌలర్లు మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నప్పటికీ, అనుభవజ్ఞులైన మహ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్, యుజ్వేంద్ర చాహల్ ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఫ్రాంచైజీలు పెట్టుకున్న నమ్మకాన్ని ఈ ముగ్గురు సార్థకం చేస్తూ మ్యాచ్‌లను ప్రభావితం చేస్తున్నారు. ముఖ్యంగా షమీ తన కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో మళ్లీ ఫామ్‌లోకి వచ్చినట్లు కనిపిస్తున్నాడు. ఇటీవల మ్యాచ్‌లో తక్కువ పరుగులు ఇచ్చి కీలక వికెట్లు పడగొట్టడం ద్వారా తన అనుభవాన్ని చూపించాడు. జాతీయ జట్టులోకి తిరిగి రావాలనే లక్ష్యంతో అతడు కష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఇక భువనేశ్వర్ కుమార్ తన స్వింగ్ బౌలింగ్‌తో మరోసారి మెరుస్తున్నాడు. పవర్‌ప్లేలోనే పరుగులను కట్టడి చేయడమే కాకుండా, కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జట్టుకు బలంగా నిలుస్తున్నాడు. డాట్ బాల్స్ వేయడంలో అతని నైపుణ్యం ఇప్పటికీ తగ్గలేదు. యుజ్వేంద్ర చాహల్ విషయానికి వస్తే, వ్యక్తిగత ఇబ్బందులను అధిగమించి మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకున్నాడు. క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ కీలక వికెట్లు సాధిస్తున్నాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా తన స్థాయిని మరోసారి చాటుతున్నాడు. మొత్తానికి, అనుభవం ముందు వయసు అడ్డంకి కాదని ఈ వెటరన్ బౌలర్లు నిరూపిస్తున్నారు. వీరి ప్రదర్శన జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది.



# ఓపెనర్ల వైఫల్యం.. మిడిల్ ఆర్డర్ పై ఒత్తిడి

## ఎస్ఆర్‌హెచ్, సీఎస్‌కేకు తలనొప్పిగా టాప్ ఆర్డర్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ తాజా సీజన్‌లో జట్ల ప్రదర్శనలో స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు రెండేసి విజయాలతో నిలదొక్కుకున్నాయి. అయితే ఢిల్లీ మినహా మిగతా జట్లలో ఓపెనింగ్ విభాగం ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ఢిల్లీ మాత్రం మిడిల్ ఆర్డర్ బ్యాటర్ల సహకారంతో మ్యాచ్‌లు గెలుచుకుంటోంది. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. గత సీజన్‌లో అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ జోడీ ప్రత్యర్థి బౌలర్లను భయపెట్టేలా దూసుకెళ్లగా, ఈసారి మాత్రం ఆ దూకుడు కనిపించడం లేదు. మూడు మ్యాచ్‌లలో ఇద్దరూ కలిసి పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. త్వరగా వికెట్లు కోల్పోవడం వల్ల మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. నితీశ్, క్లాసెన్ వంటి ఆటగాళ్లు కొంతవరకు జట్టును నిలబెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ, ఓపెనర్ల నుంచి స్థిరత్వం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లపై కూడా ఓపికగా ఆడకపోవడం ఎస్ఆర్‌హెచ్‌కు నష్టంగా మారుతోంది. బౌలింగ్ ఇప్పటికే బలహీనంగా ఉన్న నేపథ్యంలో బ్యాటింగ్ విభాగం రాణించకపోతే విజయాలు సాధించడం కష్టమవుతోంది. చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. రుతురాజ్ గైక్వాడ్, సంజు శాంసన్ జోడీపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ, అవి ఇప్పటివరకు నెరవేరలేదు. ఇద్దరి మధ్య అత్యధిక భాగస్వామ్యం కేవలం 14 పరుగులే కావడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా సంజు శాంసన్ నుంచి భారీ ఇన్నింగ్స్ రావాలని అభిమానులు ఆశించినా, ఆయన ఇంకా ఫామ్ అందుకోలేకపోయారు. గతంలో చెన్నైకి మంచి ఆరంభాలు ఇచ్చిన ఓపెనింగ్ జోడీ లేకపోవడం జట్టుకు దెబ్బతీస్తోంది. మిడిల్ ఆర్డర్‌పై అధికంగా ఆధారపడాల్సి వస్తుండటంతో మ్యాచ్‌లలో ఒత్తిడి పెరుగుతోంది. మొత్తానికి, ఇతర జట్లలో కనీసం ఒక ఓపెనర్ నిలబడి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్తుండగా, ఎస్ఆర్‌హెచ్, సీఎస్‌కే జట్లలో మాత్రం ఆ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సమస్యను త్వరగా అధిగమించకపోతే, ఈ రెండు జట్ల ప్లేఆఫ్స్ ఆశలు దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ధోని రీఎంట్రీకి గ్రీన్ సిగ్నల్?

## సీఎస్‌కే అభిమానుల్లో ఉత్సాహం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న మహేంద్ర సింగ్ ధోని రీఎంట్రీకి రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు రెండు వారాలు ఆటకు దూరమని సీఎస్‌కే ప్రకటించడంతో ఫ్యాన్స్ నిరాశకు గురయ్యారు. అదే సమయంలో జట్టు వరుస పరాజయాలు చవిచూస్తుండటంతో ధోని త్వరగా మైదానంలోకి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇటీవల ధోని ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, అతని రాకపై ఊహాగానాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో రాబోయే రెండు రోజుల్లో ధోనికి ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఆ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే, దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆయన ఆడే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఈ మ్యాచ్ వచ్చే శనివారం జరగనుంది. ఇక మరోవైపు సీఎస్‌కేకు కీలకమైన హిట్టర్ డేవాల్డ్ బ్రెవిస్ కూడా తిరిగి జట్టులోకి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. జట్టు ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాట్లాడుతూ, బ్రెవిస్ తదుపరి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇంకా కొంత సమయం ఉండటంతో జట్టు ప్రణాళికలను అనుకున్న విధంగా అమలు చేస్తామని తెలిపాడు.



# డెత్ ఓవర్లలో తప్పిదాలే సీఎస్‌కే ఓటమికి కారణం: అంబటి రాయుడు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**



చెన్నై సూపర్ కింగ్స్ పరాజయానికి ప్రధాన కారణం బౌలింగ్‌లో వైఫల్యమేనని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో సరైన వ్యూహాలు అమలు చేయకపోవడం జట్టుకు తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు చివరి నాలుగు ఓవర్లలోనే భారీగా పరుగులు సాధించడంతో మ్యాచ్ దిశ పూర్తిగా మారిపోయిందని విశ్లేషించాడు. 251 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సీఎస్‌కే 207 పరుగులకే పరిమితమవడం ఆ ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తోందని చెప్పాడు. డెత్ ఓవర్లలో అనుసరించిన ప్రణాళికలు సరైనవి కావని రాయుడు విమర్శించాడు. ప్రాక్టీస్‌లో కొత్త వ్యూహాలు రూపొందించినప్పటికీ, అవి ప్రాక్టికల్‌గా పనిచేయవని, మహేంద్ర సింగ్ ధోని లాంటి అనుభవజ్ఞుడు ఉంటే అలాంటి ప్లాన్‌లను అంగీకరించేవాడు కాదని వ్యాఖ్యానించాడు. బ్యాటర్లను కట్టడి చేయాలంటే యార్కర్లు, స్లో డెలివరీలు వంటి సంప్రదాయ బౌలింగ్ పద్ధతులపైనే దృష్టి పెట్టాలని సూచించాడు. ఈ అంశంపై జట్టు సమగ్రంగా సమీక్ష జరపాల్సిన అవసరం ఉందని తెలిపాడు. మరోవైపు సీఎస్‌కే ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా మ్యాచ్‌పై స్పందిస్తూ టిమ్ డేవిడ్ ఇన్నింగ్స్‌నే కీలక మలుపుగా పేర్కొన్నాడు. తక్కువ బంతుల్లోనే అతడు వేగంగా పరుగులు సాధించడం వల్ల మ్యాచ్ స్వరూపం పూర్తిగా మారిపోయిందని తెలిపాడు. ఆ దశ వరకు మ్యాచ్ తమ నియంత్రణలోనే ఉందని, కానీ చివరి ఓవర్లలో జరిగిన పరిణామాలు పెద్ద లక్ష్యాన్ని ముందుంచాయని చెప్పాడు. అలాగే సంజు శాంసన్ ప్రదర్శనపై ఎలాంటి సందేహం లేదని, అతను త్వరలోనే తన స్థాయిని చూపిస్తాడని ఫ్లెమింగ్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

# టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా జేయన్ మేరీ ఖాన్..

**ముద్ర, సినిమా డెస్క్ :**
సినిమా విడుదలకు ముందే గ్లామర్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం కొందరు హీరోయిన్ల ప్రత్యేకతగా మారుతోంది. ప్రస్తుతం అలాంటి చర్చల్లో జేయన్ మేరీ ఖాన్ పేరు ముందువరుసలో వినిపిస్తోంది. అడవి శేష్, మృనాల్ ఠాకూర్ జంటగా నటించిన 'డెకాయిట్' చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో జేయన్ మేరీ ఖాన్ ఆకర్షణగా నిలిచింది. సిల్వర్ కలర్ శారీ, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో ఆమె కనిపించిన తీరు అందరి దృష్టిని తనవైపు మళ్లించింది. ఈవెంట్‌లో ఆమె ఎంట్రీ ఇచ్చిన వెంటనే కెమెరాలన్నీ ఆమెపై ఫోకస్ కావడంతో, ఒక్కసారిగా ఆమె పేరు టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. దీంతో ఆమె గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగింది. జేయన్ మేరీ ఖాన్ బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ కుటుంబానికి చెందినది. దర్శకుడు మన్సూర్ ఖాన్ కుమార్తెగా ఇప్పటికే హిందీ చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. 'డెకాయిట్' మంచి విజయాన్ని సాధిస్తే, తెలుగులో కూడా ఆమెకు మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశముందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి





# 'పెద్ది'లో గ్రాండ్ ఐటమ్ సాంగ్..
## 9 నుంచి షూటింగ్

**ముద్ర, సినిమా డెస్క్ :**
మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి బుచ్చి బాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి సంబంధించిన టాకీ పార్ట్ దాదాపు పూర్తయిందని, ఒక్క పాట మాత్రమే మిగిలి ఉందని రామ్ చరణ్ ఇటీవల వెల్లడించారు. ప్రస్తుతం ఐటమ్ సాంగ్ మాత్రమే బ్యాలెన్స్‌లో ఉండగా, దాని చిత్రీకరణను ఏప్రిల్ 9 నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ పాటను గ్రాండ్‌గా తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారని, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించనున్నట్లు తెలుస్తోంది. ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉండగా, ఈ పాటలో మృనాల్ ఠాకూర్ కనిపించే అవకాశం ఉందనే ప్రచారం కొనసాగుతోంది. అయితే ఈ విషయంపై ఆమె ఇప్పటివరకు ఎలాంటి స్పందన ఇవ్వలేదు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.



# చెన్నైలో విషాదం.. నటి సుభాషిణి ఆత్మహత్య

**ముద్ర, సినిమా డెస్క్ :**
తమిళ సినీ పరిశ్రమలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. నటి సుభాషిణి బాలసుబ్రమణియం (36) చెన్నైలోని తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆమె కుటుంబ సభ్యులు, సినీ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక వివరాల ప్రకారం కుటుంబ సమస్యల కారణంగా ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. అయితే అసలు కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఆమె మృతితో సినీ వర్గాల్లో విషాద వాతావరణం నెలకొంది.


# కమల్ హాసన్‌కు సాటి లేరు..
## 'గాయపడ్డ సింహం'పై జేడీ చక్రవర్తి వ్యాఖ్యలు

**ముద్ర, సినిమా డెస్క్ :**
సినీ చరిత్రలో కమల్ హాసన్ చేసిన పాత్రలకు సాటి ఎవరూ లేరని నటుడు జేడీ చక్రవర్తి పేర్కొన్నారు. తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన 'గాయపడ్డ సింహం' సినిమా మే 1న విడుదల కానుంది. ఈ చిత్రంలో జేడీ చక్రవర్తి కీలక పాత్రలో కనిపించనున్నారు.సినిమా ప్రెస్ మీట్‌లో మాట్లాడిన ఆయన, నటులందరికీ కమల్ హాసన్ ఒక ప్రమాణంగా ఉంటారని అన్నారు. ఆయన చేసిన విభిన్న పాత్రలు ఇప్పటివరకు ఎవరూ చేయలేదని, భవిష్యత్తులో కూడా ఆ స్థాయిని అందుకోవడం కష్టమని అభిప్రాయపడ్డారు. తన పాత్ర గురించి మాట్లాడుతూ, ఈ సినిమాలో తనకు వచ్చిన పాత్ర ఎంతో ప్రత్యేకమని, అనేక వేరియేషన్స్‌తో సాగుతుందని తెలిపారు. తన కెరీర్‌లో 'మనీ', 'అనగనగా ఒక రోజు' లాంటి గుర్తుండిపోయే పాత్రల తర్వాత మళ్లీ అలాంటి అవకాశం దొరికిందని చెప్పారు.'గాయపడ్డ సింహం'లో పలువురు దర్శకులు కూడా నటిస్తున్నారని, ఇది దర్శకుల సినిమాగా నిలుస్తుందని జేడీ చక్రవర్తి తెలిపారు.



# '4వ అధ్యాయం'గా రీ ఎంట్రీ.. ఆహాలో ఆకట్టుకుంటున్న రివేంజ్ డ్రామా

**ముద్ర, సినిమా డెస్క్ :**
తమిళంలో ప్రశంసలు అందుకున్న 'అధర్మ కథైగళ్' చిత్రం ఇప్పుడు '4వ అధ్యాయం' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వెట్రి, సాక్షి అగర్వాల్, అమ్ము అభిరామి, దివ్య దురైసామి, సునీల్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని కామరాజ్ వేల్ రూపొందించారు. 'న్యాయానికి అతీతం' అనే ట్యాగ్‌లైన్‌తో ఇది ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. నాలుగు వేర్వేరు కథలతో కూడిన ఈ ఆంథాలజీ, ప్రతీకారం చుట్టూ తిరిగే భావోద్వేగాలను బలంగా చూపిస్తుంది. ప్రతి కథలో పాత్రల మానసిక స్థితి, వారి నిర్ణయాలు ఆసక్తికరంగా మలిచారు. గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే, టెక్నికల్ విలువలు సినిమాకు బలం అయ్యాయి. తెలుగులో విడుదలైన తర్వాత '4వ అధ్యాయం'కు మంచి స్పందన లభిస్తోంది. థ్రిల్లింగ్ కంటెంట్‌ను ఇష్టపడే వారికి ఇది మంచి ఎంపికగా నిలుస్తోంది.




# త్రిష పోస్ట్‌లో ఆంతర్యం ఏమిటి?..

**ముద్ర, సినిమా డెస్క్ :**
స్టార్ హీరోయిన్ త్రిష సోషల్ మీడియాలో చేసిన తాజా పోస్టులు ఇప్పుడు వైరల్‌గా మారాయి. వ్యక్తిగత జీవితం, ప్రేమపై వస్తున్న పుకార్ల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు నెటిజన్లలో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. "ప్రేమ అన్నది అంతా కాదు, కానీ అది లేకపోతే ఖాళీగా అనిపిస్తుంది" అంటూ చేసిన పోస్ట్‌తో ఆమె ప్రేమలో ఉందేమో అనే చర్చ మొదలైంది. అదే సమయంలో, అనవసరమైన వాదనలకు దూరంగా ఉండాలని, మనశ్శాంతికే ప్రాధాన్యం ఇస్తానని ఆమె పేర్కొంది. మౌనం కూడా ఒక సమాధానమే అని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని చెప్పిన త్రిష, తనపై వచ్చే విమర్శలకు పరోక్షంగా సమాధానం ఇచ్చినట్లు కనిపిస్తోంది.



# ఓవర్సీస్ లో 'డెకాయిట్' కి సెన్సేషనల్ బుకింగ్స్..

ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :
'హిట్ 2' తర్వాత దాదాపుగా నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అడివి శేష్ మన ముందుకు 'డెకాయిట్' చిత్రం ద్వారా రాబోతున్నాడు. విడుదలకు ముందు టీజర్, ట్రైలర్ లతో ఈ చిత్రం కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అడివి శేష్ సినిమా అంటే ఈ మాత్రం ఉండాలి, మరోసారి సరికొత్త కాన్సెప్ట్ తో మన ముందుకు రాబోతున్నాడు అంటూ నెటిజెన్స్ సోషల్ మీడియా లో కామెంట్స్ చేస్తున్నారు. ఇక మరో పక్క అడివి శేష్ వరుసగా ప్రమోషనల్ కార్యక్రమాల్లో బిజీ గా ఉంటూ , క్షణ కాలం తీరిక లేకుండా గడుపుతున్నాడు . సోషల్ మీడియా లో ఓపెన్ చేసి చూస్తే చాలు , ప్రస్తుతం అడివి శేష్ మాత్రమే ఎక్కడ చూసినా కనిపిస్తున్నాడు . ఆ రేంజ్ లో ఈ మూవీ ప్రొమోషన్స్ జరుగుతున్నాయి. ఇకపోతే రీసెంట్ గానే ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ నార్త్ అమెరికా లో మొదలైంది. బుకింగ్స్ ట్రెండ్ మామూలు రేంజ్ లేదు. ఊపు చూస్తుంటే కచ్చితంగా ఈ చిత్రం ప్రీమియర్స్ నుండే హాఫ్ మిలియన్ డాలర్ల గ్రాస్ ని కొల్లగొట్టేలా ఉందని అంటున్నారు అక్కడి ట్రేడ్ విశ్లేషకులు. వాళ్ళు అందిస్తున్న సమాచారం ప్రకారం ఈ చిత్రానికి గడిచిన 24 గంటల్లో 65 వేల డాలర్ల గ్రాస్ వసూళ్లు నమోదు అయ్యాయి అట. ఈమధ్య కాలం లో స్టార్ హీరోలకు కూడ ఈ రేంజ్ అడ్వాన్స్ బుకింగ్స్ జరగలేదు. దీనిని బట్టీ అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, ఓవర్సీస్ ఆడియన్స్ లో అడివి శేష్ వరుస సూపర్ హిట్ సినిమాలతో ఎలాంటి నమ్మకాన్ని అక్కడి ఆడియన్స్ లో సంపాదించుకున్నాడు అనేది. ఈ చిత్రాన్ని నిర్మించడానికి పట్టుమని పది కోట్ల బడ్జెట్ కూడా ఖర్చు అయ్యుండదు. కానీ ఊపు చూస్తుంటే కచ్చితంగా వరల్డ్ వైడ్ గా మొదటి రోజే ఈ చిత్రం 10 కోట్ల గ్రాస్ ని కొల్లగొట్టేలా ఉందని అంటున్నారు. సంక్రాంతి తర్వాత సరైన హిట్ కోసం ఎదురు చూస్తున్న టాలీవుడ్ కి , ఈ చిత్రం రూపం లో భారీ హిట్ నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. కేవలం పాజిటివ్ టాక్ వస్తే చాలు, ఈ చిత్రానికి వంద కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు నమోదు అవుతాయి. ఇకపోతే ఈ చిత్రం లో హీరోయిన్ గా మృణాల్ ఠాకూర్ నటించింది. ముందుగా శృతి హాసన్ ని తీసుకున్నారు. అనేక సన్నివేశాలను చిత్రీకరించారు కూడా. ఒక టీజర్ ని కూడా వదిలారు. కానీ ఆమెకు డేట్స్ సమస్య కారణంగా మధ్యలోనే ఈ చిత్రాన్ని వదిలి వెళ్ళిపోయింది. దీంతో మేకర్స్ వెంటనే మృణాల్ ఠాకూర్ ని సంపాదించారు. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్ర కావడం తో ఆమె కూడా వెంటనే ఒప్పేసుకుంది. మరి వెండితెర పై వీళ్లిద్దరు కలిసి ఈసారి ఎలాంటి మ్యాజిక్ రీ క్రియేట్ చేయబోతున్నారో చూడాలి.





# బీచ్‌లో అదితి గ్లామర్ షో

**ముద్ర, సినిమా డెస్క్ :**
నేపాలీ నటి అదితి బుధథోకి తన తాజా బీచ్ ఫోటోతో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. బ్లూ వైట్ చెక్డ్ బికినీలో వైట్ సాండ్‌పై స్టైలిష్‌గా పోజ్ ఇస్తూ నేచురల్ బ్యూటీతో మెరిసింది.పామ్ చెట్లు, బ్లూ స్కై మధ్య ఆమె లుక్ ట్రాపికల్ ఫీల్‌ను తెచ్చింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన అదితి 'క్రి' సినిమాతో గుర్తింపు పొందింది. ప్రస్తుతం గ్లామర్ ఫోటోషూట్స్‌తో పాటు నటిగా కూడా తన కెరీర్‌ను కొనసాగిస్తోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com